ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
09 జనవరి, 2011

ENTERED

సముద్ర గర్భంలో నిశ్శబ్ద గమనం

హ్యాపీబర్త్‌డే

(2011 జనవరి 1నుంచి 2011 జనవరి 15 వరకు)

జి. సౌమ్య
8సం॥,జనవరి-12
మాధవి-నర్సింహ
తిప్పాయిగూడెం-రంగారెడ్డి

ఎన్. హర్షిత
2సం॥,జనవరి-12
మణి-కన్నా
అనకాపల్లి-విశాఖ

వి. రాకేష్‌కుమార్
1సం॥,జనవరి-2010
పద్మావతి-సూర్యనారాయణ
కాంతినగర్-విశాఖ

ఎ. స్ఫూర్తి
7సం॥,జనవరి-13
రమాదేవి-మాల్యాద్రి
ఒంగోలు-ప్రకాశం



వై. మేఘన
1సం॥,జనవరి-14
లక్ష్మి-నాగరాజు
తాడేపల్లి-గుంటూరు

అభినవ్ దీక్షిత్
1సం॥,జనవరి-2010
సరిత-రాజేందర్
రాంనగర్-కరీంనగర్

కె. వినోద్‌కుమార్
9సం॥,జనవరి-2002
సుశీల-వెంకటసుబ్బయ్య
అలిరెడ్డిపల్లె-కడప

వి. పూజిత
7సం॥,జనవరి-14
నాగకుమారి-హరేరామ్
పెనుమంట్ర

ఇ. వైష్ణవి
3సం॥,జనవరి-2008
విజయ-సతీష్
కొడకండ్ల-వరంగల్

టి. కిషోర్
1సం॥,జనవరి-9
శ్రీలక్ష్మి-శ్రీహరిరావు
కాకినాడ-తూ॥గో॥

మనలో మాట

సంబరానికి 'మందు' పథకం!



డిసెంబరు ఆఖరివారం నుంచే మనకు పండగ వాతావరణం ప్రారంభమవుతుంది. 'సంకరాత్రి వస్తోంది... సంబరాలు తెస్తోంది.' అని చాలామంది సంబరపడతారు. అయితే, ఈసారి మాత్రం ఎవరి ముఖాల్లోనూ సంతోషం కనపడడం లేదు. చేతికొచ్చిన పంట పోయి రైతులూ, చేతినిండా పనుల్లేక కూలీలూ, ధరలు ఆకాశమార్గం పట్టి పోతుంటే- అడ్డుకునే నాథుడు లేక సామాన్యులూ... ఊసురోమంటున్నారు. కొనేవాళ్లు తగ్గి వ్యాపారులూ; పిండివంటలూ, తిండివంటలూ, అల్లుళ్లకు పెట్టుపోతలూ తలుచుకొని అత్తమామలూ... నిట్టూరుస్తున్నారు. ఈ పరిస్థితిని పరికించే కాబోలు- మన సర్కారు 'ఊసురోమని మనుషులుంటే దేశమే గతి బాగుపడునోయ్?' అని తెగ యోచించింది. 'నష్టపరిహారం పెంచి, సబ్సిడీలు ఇచ్చి... సహాయపడితే రైతు ఒక్కడికే సంబరం. కానీ, అన్ని తరగతుల జనానికి హుషారు కలిగించాలంటే ఒకటే 'మందు.'' అని ఒక నిర్ణయానికి వచ్చింది! ఊరూరా బ్రాందీ షాపులూ, బెల్టుషాపులూ ఎన్ని వీలైతే అన్ని ఉదారంగా తెరిచి మన'సారా' సేవ చేయాలని సంకల్పించింది!

వీధివీధినా మద్యం ప్రవహింపచేసి, సంక్రాంతికి ఒక కళ తీసుకురావాలన్నది మన పాలకుల మాస్టరు ప్లాను! గతించిన కళలూ, అంతరిస్తున్న సంస్కృతీ సాంప్రదాయాలూ ఊరూరా ఆవిష్కృతం కావటానికి ఇది దోహదపడుతుందని ప్రభుత్వం మనసారా నమ్ముతోంది. *'సారా లేకుంటే సంబరమే లేదోయి... చుక్క నోట పడకుంటే చురుకుదనం ఏదోయి?'* అన్న తాగుబోతు తమ్మారావు మత్తోక్తిని అక్షరాలా పాటిస్తోంది! *'తాగరా సోదరా.. తాగి ఊగరా'* అని తందానతాన పాడుతోంది!

ఇదంతా ఎందుకంటే- తాగిన వాడు ఊగుతాడు. ఊగుతూ పాడతాడు. ఊగుతూ తాగుతూ పదేపదే కింద పడతాడు. తుళ్లుతూ జోగుతూ పైకి లేస్తాడు. ఈ దృశ్యం మళ్లీ మళ్లీ లైవ్ షోలా ఆవిష్కృతమవుతూనే ఉంటుంది. చూసేవాళ్లకి ఎంత వినోదం? అదన్నమాట మన పాలక పెద్దల ఆలోచన!

ఇక మనం అంతర్ధానం అయిపోతున్నాయని అనుకుంటున్న హరికథలూ, బుర్ర కథలూ, శివతాండవ నృత్యాలూ, కోలాటాలూ ... ఈ 'మందుపథకం' ద్వారా వీధివీధినా కనువిందు చేస్తాయి. ఉదాహరణకు : ఇల్లూ ఇల్లాలూ అంటే భయభక్తులున్న మనిషి తాగి వచ్చి, చెప్పేవన్నీ 'హరికతలే'! 'అసలు ఆలస్యం ఎందుకైందంటే..?', 'ఎటువంటి పరిస్థితిలో తాగాల్సి వచ్చిందంటే..?' అని వినిపించే కతలు- ఎన్ని మలుపులు తిరుగుతాయో! ఎంత సృజనాత్మకంగా సాగుతాయో!

'తాగుతా... తైతక్కలాడతా..' అని తెగించే మందుబాబులతో అయితే సందడే సందడి! బుద్ధి తక్కువై ఎవ్వడైనా వారికి తారసపడితే 'బుర్రకతలు' చెబుతారు. వద్దు మొర్రో అన్నా వదిలిపెట్టరు. కిక్కు బాగా తలకెక్కిన వాళ్లు ప్రదర్శించే వినోద విన్యాసాలు ఇన్నీ అన్నీ కావు. 'సాగరసంగమం' సినిమాలో కమల్ హాసన్ నూతిగట్టుపై చేసిన నృత్యం- 'బుడ్డి' ఘనతే తప్ప నటుడి ఘనత కాదని వాదించేవాళ్లూ ఉన్నారు. ఇలాంటి వాళ్లు ఇద్దరు ముగ్గురు తోడైతే... ఆ ఊరికి సంబరమే సంబరం... జనానికి రాత్రంతా జాగారం! లెక్క లేనన్ని బ్రాందీ షాపులకు లైసెన్సులు ఇవ్వడం వల్ల జనానికి వినోదం, సర్కారుకు ఆదాయం! ఈ ఉభయతారక తంత్రం తనకు శ్రీ'సారా'రక్ష అని మన రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ముమ్ముందు ఈ జబ్బు మరింత ముదిరిపోకుండా ఉండాలంటే సమయం చూసుకొని సరైన మందు వేయాల్సిన బాధ్యత ముమ్మాటికీ మనదే!

✶

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
ఈ పేజ్	...	4
కవిత్వమ్	...	6
కొత్త పుస్తకాలు	...	7
సీరియల్	...	8
అట్టమీది కథ	...	14
కథ	...	18
తెల్సా	...	21
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

సినిమా కబుర్లు ... 10

మన బాక్సాఫీస్ రికార్డుల్లో అసలెంత? కొసరెంత?



చూద్దామా ... 12

గులాబి నగరం అందాలు... నీలి నగరం చందాలు...

వికాసం ...20

పలకరిస్తే... పరమానందమే...



నయాగరా తుంపర్లలో తడిచిపోయాం

తెరపై సినిమాను మూడు గంటలు చూసి ఆనందించి బాగుందనో లేదనో సర్టిఫై చేస్తాడు సగటు ప్రేక్షకుడు. అయితే అంత ప్రధానమైన వ్యక్తికి సినిమా పరిశ్రమపై ఆధారపడి బతికే వేలాది మంది శ్రామికుల కష్టాలు, కడగండ్లు తెలిసే అవకాశం లేదు. రెంటాల జూనియర్ విశ్లేషించినట్లు తెలుగు చిత్ర నిర్మాణానికి పరాయివారి శక్తిసామర్థ్యాలపై ఆధారపడడం (గుడ్డిగా) మాని తెలుగువారికే అవకాశాలు కల్పించే స్వాభిమానం, ఆత్మాభిమానం ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. నయాగరా సొగసులు చదివాక ఆ జలపాత తుంపరలలో తడిచినట్లు, మెయిడ్ ఆఫ్ ద మిస్ట్ ట్రిప్ చేసినట్లు, రివాల్వింగ్ హోటల్లో కాఫీ సిప్ చేస్తున్న అనుభూతి కలిగాయి. 'మరో జన్మ కోసం చూడక ఈ జన్మ వృథా చేయకని' అనే వాక్యం తాత్కాలికమైంది. హేతుబద్ధమైంది. ఆలోచింపదగినది. మూఢత్వాన్ని పారదోలి, చైతన్య స్రవంతిలోకి పయనించే నిహారిణి కవిత 'అమ్మ' హృద్యతను సింగారించుకుంది. ప్రపంచీకరణ, సరళీకరణ పేరుతో ఉగ్రవాదంపై పోరు నెపంతో ఆర్థిక సాయం పేరుతో అభివృద్ధి చెందిన దేశాలు పన్నే కుట్రలు, కుతంత్రాలను, దుర్నీతిని నిర్భీతిగా వెల్లడించగలుగుతున్న వికీలీక్స్ వంటి వెబ్‌సైట్లు, వాటి యజమాన్యం కృషి వాంఛనీయం. ఈ ప్రపంచం మొత్తం ఇందులో నివశించేవారికి చెందుతుంది తప్ప ఏ ఒక్క దేశం సొత్తూ కాదు. అందరూ సమాన హక్కు దారులే. ఎవరూ ఎంతో కాలం మరొకరిని తమ చెప్పుచేతల్లో ఉంచుకోలేరు. మొన్నటి వరకూ శాంతి దూతగా వున్న అసాంజే ఒక్క రోజులో కామికుడిగా, దేశద్రోహిగా ముద్రించబడడం వెనుక గల వ్యూహం విచారకరం.

భైరి సత్యనారాయణ, కొత్తగూడెం.

దినుసులు కలిపిన మనసులు

కట్టడాలు కాని కట్టడాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. చేతికో కళ, జిహ్వకో రుచి అంటే బాగుంటుందేమో! దినుసులు కలిపిన దేశాలు మనసులను కలిపినట్లుంది. కాలం గురించి కవులు కవిత్వాలు రాస్తుంటారు. అల్లం, నువ్వులు, చింతకాయ చట్నీలు బాగున్నాయి. చూటీ 'పగటికల పాండు' కథ బాగుంది. కాలగతిలో యువకులు ముదుసలులు అవుతారు కదా.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

అలరించిన 'కాలం ఖాతాలో...'

2010 సంవత్సరపు చివరి వారం సంచికలో 'కాలం ఖాతాలో వీడ్కోలు వీక్షణం' పాఠకులను అలరించింది. కాలం అనే కెరటాలు ఆగనివి. అనంత కాల పరిధిలో మరో ఏడాది కరిగిపోయింది. ఈ ఏడాదిలో ఎన్నో సంఘర్షణలు, సంక్షోభాలు, నింగినంటిన ధరలు, విధివైపరీత్యాలు ప్రజలను సమస్యల సుడిగుండంలో ముంచెత్తాయి. 2011 సంవత్సరం అందరికీ సుఖశాంతులు కలగాలని ఆశిద్దాం.

ఆచార్య నూతి నారాయణరావు, హైదరాబాద్.

ఔరా! ఏం కట్టడాలు!!

ఈ సవత్సరం చివరి సంచికలో అట్టమీది కథగా వచ్చిన రవి గారి విశ్లేషణ ఆసక్తిదాయకంగా ఉంది. ఏం కట్టడాలు.. చిత్రావళి 'ఔరా' అనిపించాయి. పరస్పర సహకారం, ఇచ్చిపుచ్చుకునే ధోరణి వల్ల దేశాల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందుతాయి. దేశాలను కలిపిన దినుసుల పాత్ర ఈ వారం తెలుసుకున్నాం. సినిమా కబుర్లలో సినీ ప్రపంచానికి సంబంధించిన నగ్న సత్యాలను ఏకరువు పెట్టింది. కొత్త పుస్తకాల శీర్షికలో సమీక్షల ద్వారా 'సత్య శోధన, అక్షరశిల్పులు, దేశ భక్తి' పుస్తకాలు అందరూ చదివి తీరాల్సినవిగా అనిపించాయి. బాల నేస్తాలలో 'చేద్దామా' సింహం బోను తయారీ బావుంది కానీ సింహం



తయారీ ఎలా అన్నది సంశయంలో పడ్డాం. స్ఫూర్తి ద్వారా ప్రముఖులను కదిలించిన సాహిత్యాన్ని పరిచయం చేయడం బావుంది. తద్వారా మేమూ స్ఫూర్తి పొందుతున్నాం. మనలోమాట అనుసరణీయంగా ఉంది.

నేమాన సుభాష్ చంద్రబోస్, శ్రీకాకుళం.

కాలం తిరిగిరాదు

కవర్‌స్టోరీ కాలం ఖాతాలో వీడ్కోలు వీక్షణం బాగుంది. అన్నింటి కంటే విలువైనది కాలం. గడిచిన కాలం తిరిగి రాదు. కాలం అనుభవాల గుణపాఠం. నేటి యువత కాలాన్ని దుర్వినియోగం చేయడం మామూలైపోయింది. పనిచేసే సందర్భాల్లో కాలాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ధనిక, పేద తేడా లేకుండా ఎవరికైనా కాలం ప్రధాన్యత ఒక్కటే. వ్యాస రచయితకు అభినందనలు.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

★

సోయా మంచూరియా

కావలసిన పదార్థాలు

సోయా చన్క్స్ - 100 గ్రా, గోధుమ పిండి - 4 టేబుల్ స్పూన్లు, మొక్కజొన్న పిండి - 2 టేబుల్ స్పూన్లు
మిరియాల పొడి - రుచికి కొద్దిగా, ఉప్పు - రుచికి సరిపడా
సన్నగా తరిగిన వెల్లుల్లి - 2 టీ స్పూన్లు, అజినమోటో - చిటికెడు
తరిగిన మిరపకాయలు - రుచికి, సోయా సాస్ - 2 టీ స్పూన్లు
నూనె - 2 టీ స్పూన్లు, ఇంకా వేయించడానికి సరిపడా

తయారు చేసే పద్ధతి

సోయా చన్క్స్‌ని పావుగంట సేపు నీళ్లలో నానబెట్టి గట్టిగా పిండాలి. గోధుమ పిండి, మొక్కజొన్న పిండి, మిరియాల పొడి, ఉప్పు, తగినంత నీరు పోసి బాగా కలిపి చిక్కని పిండి చేయాలి. నానబెట్టిన సోయా చన్క్స్‌లను ఈ పిండిలో ముంచి నూనెలో వేయించి పక్కన పెట్టాలి. మూకుడులో 2 టీ స్పూన్ల నూనె వేసి చేసి అల్లం, పచ్చిమిర్చి వేసి కలియబెట్టాలి. తర్వాత సోయా సాస్, అజినమోటో, ఉప్పు కలిపి ఒక నిమిషం సేపు ఉడికించాలి. ఈ మిశ్రమానికి రెండు టేబుల్ స్పూన్ల నీళ్లు కలిపి మరిగించాలి. ఒక టేబుల్ స్పూన్ మొక్కజొన్న పిండి, కొద్దిగా నీళ్లు కలిపితే సాస్ చిక్కబడుతుంది. ముందుగా వేయించి పెట్టుకున్న సోయా చన్క్స్‌ని ఈ సాస్‌లో కలిపి ఐదు నిమిషాలు ఉడకబెట్టాలి. వీటిని వేడిగా తింటే బావుంటాయి.

కమ్మని సోయా రుచులు

సోయా పాలక్ పరోటా

కావలసిన పదార్థాలు

సోయా పిండి - అరకేజీ
పాలకూర - 200 గ్రా
పచ్చిమిర్చి - రుచికి సరిపడా
అల్లం - 2 టీస్పూన్లు
దనియాల పొడి - అర టీ స్పూన్
గరం మసాలా - అర టీ స్పూన్
నిమ్మరసం - 1 టీ స్పూన్
ఉప్పు - రుచికి సరిపడా
నూనె - వేయించడానికి

తయారు చేసే పద్ధతి

పాలకూరను శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా చేయాలి. పచ్చిమిరపకాయలను కూడా సన్నని ముక్కలుగా కోయాలి. వీటన్నింటిని సోయా పిండిలో వేసి కలిపి చపాతి ముద్దలా చేయాలి. ఈ ముద్దపై తడి బట్ట కప్పి అరగంట సేపు నాననివ్వాలి. తర్వాత దీనిని చిన్న వుండలుగా చేసుకోవాలి. వీటిని చపాతీలా చేసి పెనంపై కాలిస్తే సరి. సోయా పాలక్ పరోటా రెడీ. దీన్ని పెరుగు పచ్చడితో వేడిగా తింటే చాలా రుచిగా వుంటుంది.

నవాబి గ్రాన్యూల్ కర్రీ

కావలసిన పదార్థాలు

సోయా గ్రాన్యూల్
(సోయా గింజలతో చేసిన ముక్కలు)- 100 గ్రా
ఉల్లిపాయలు - 2, టొమాటోలు - 3
నూనె - 2 టేబుల్ స్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్టు - 1 టీ స్పూన్
జీడిపప్పు - 10, పసుపు - చిటికెడు
కారం - 1 టేబుల్ స్పూన్, ఉప్పు - సరిపడా
గరం మసాలా - అర టీ స్పూన్, కొబ్బరి పొడి - 2 టీ స్పూన్లు
కొత్తిమీర - 2 టేబుల్ స్పూన్లు

తయారు చేసే పద్ధతి

ఉల్లిపాయలు, టొమాటోలు, కొత్తిమీర సన్నగా తరగాలి. మూకుడులో నూనె తీసుకుని వేడి చేయాలి. అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి గోధుమ రంగు వచ్చేవరకు వేయించాలి. అందులోనే జీడిపప్పు కూడా వేయించాలి. తర్వాత పొడి సోయా గ్రాన్యూల్స్ కలిపి మూడు నిమిషాలు కలియబెట్టాలి. తర్వాత టొమాటోలు, పసుపు, ఉప్పు వేసి మరో మూడు నిమిషాలు ఉడకబెట్టాలి. అందులోనే ఒక కప్పు నీళ్లు పోసి సన్నని సెగమీద ఉడకనివ్వాలి. చివరిలో గరం మసాలా, కొబ్బరిపొడి, కొత్తిమీర చల్లి కలియబెట్టి రెండు నిమిషాలు ఉడకనిస్తే చాలు. నవాబి గ్రాన్యూల్ కర్రీ తయార్. ఈ కూరని వేడి వేడి రొట్టెలతో తింటే చాలా రుచిగా వుంటుంది.



సోయా టోఫు పకోడా

కావలసిన పదార్థాలు

టోఫు - 150 గ్రా, శనగపిండి - 1 కప్పు
పెరుగు - 2 టేబుల్ స్పూన్లు
కారం - 2 స్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్టు - 1 టీ స్పూన్
గరం మసాలా - అర టీ స్పూన్, ఉప్పు - సరిపడా
నూనె - వేయించడానికి సరిపడా

తయారు చేసే పద్ధతి

టోఫును (సోయా పన్నీర్) ముక్కలుగా కోయాలి. వాటిపై కొంచెం ఉప్పు చల్లి పావుగంట సేపు అలాగే ఉంచాలి. శనగపిండి, పెరుగు, కారం, అల్లం వెల్లుల్లి పేస్టు, గరం మసాలా, ఉప్పు... అన్నింటిని కలపాలి. దానిలో నీళ్లు పోసి కొంచెం జారుగా బజ్జీ పిండిలా కలపాలి. ఇలా కలిపిన పిండిలో టోఫులను ముంచి నూనెలో వేయించాలి. వీటిని వేడివేడిగా టొమాటో కెచప్‌తో తింటే చాలా బావుంటాయి.



మీ ఇమెయిల్ 'ఇన్‌బాక్స్' మొత్తం కొత్త మెసేజీలతో నిండిపోతోందా? ఆ మెయిల్స్ మీకు తెలిసినవారినుంచి వచ్చినవి కావా? మీరు వాటిని క్లిక్ చేస్తే వాటిలో ఉన్న 'సబ్జెక్ట్ లైన్స్' మిమ్మల్ని తప్పుదోవ పట్టించేవిగా ఉన్నట్లు గుర్తించారా? వాణిజ్య ప్రకటనలు లేక తప్పుదోవ పట్టించే సమాచారం ద్వారా మీరు ఆ లింకులపై క్లిక్ చేస్తే వేరే వెబ్‌సైట్లలోకి ప్రవేశించే విధంగా అవి వున్నాయా? అయితే వాటి పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండండి. విచిత్రం ఏమిటంటే కొన్నిసార్లు మీ క్రెడిట్ కార్డ్ డిటైల్స్ లేక 'ఇ-బే' పాస్‌వర్డ్ అడుగుతూ, చూడ్డానికి నిజమైన వాటిలాగానే అనిపిస్తాయి. కానీ నిజానికి అవి మీ వ్యక్తిగత, ఆర్థికపరమైన విషయాలను దొంగిలించడానికి ఉద్దేశించినవి కావచ్చు. అటువంటి సమయంలో ఏం చేయాలి?



మీ ఈ మెయిల్ 'ఇన్‌బాక్స్' స్పామ్ మెయిల్స్‌తో నిండుతోందా?

- కె.ఎక్స్.రాజు

సాధారణంగా ఇమెయిల్స్‌లో మనకు పరిచయంలేని మెయిల్ ఐడీల నుండి ఇమెయిల్స్ రావడం జరుగుతూనే వుంటుంది. ఒక్కోసారి ఇటువంటి అవాంఛిత మెయిల్స్‌తో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వుంటుంది. ముఖ్యంగా మహిళలకు ఈ బెడద ఎక్కువగా వుంటుంది. వీటితోపాటు స్పామ్ మెయిల్స్ కూడా మన ఇన్‌బాక్స్‌ను నింపేస్తుంటాయి. ఈ స్పామ్‌మెయిల్స్ సాధారణంగా ఆర్థిక సంబంధమైన విషయాలపై ఆధారపడినవిగా ఉంటాయి. స్పామ్ మెయిల్‌కు మరో పేరు 'అవాంఛిత వాణిజ్య సంబంధ ఇమెయిల్'. ఈ స్పామర్లు వేల సంఖ్యలో కొన్ని సమయాల్లో మిలియన్ల సంఖ్యలో ఇమెయిల్స్ పంపుతుంటారు. వీటి ద్వారా వారు వినియోగదారులను తమ వస్తువులు కొనేలా ప్రేరేపిస్తారు. ద్వారా ఈ స్పామర్లు అమాయకులైన ఇమెయిల్ వినియోగదారుల వ్యక్తిగత, ఆర్థిక సంబంధమైన వివరాలను సంగ్రహిస్తారు.

మెయిల్ ఐడీ ఎవరికీ ఇవ్వలేదు... అయినా ఈ అవాంఛిత మెయిల్స్ ఎందుకొస్తున్నాయో తెలియక తలలు పట్టుకోవాల్సి వస్తుంటుంది. ఎక్కువ మంది తమ ఇమెయిల్ అడ్రస్‌లను చాలాకాలంగా ఉపయోగిస్తుండడం వల్ల కూడా ఈ స్పామ్ మెయిల్స్ వస్తుంటాయి. ఎంత ఎక్కువ కాలం ఒకే ఇమెయిల్ ఉపయోగిస్తారో అంత ఎక్కువగా స్పామ్ మెయిల్స్ ఆ అడ్రస్‌కు వస్తుంటాయి. స్పామర్లు వెబ్‌సైట్ల నుంచి గ్రహించడం ద్వారా ఇమెయిల్ అడ్రస్‌ల లిస్టులను తయారు చేస్తారు. ఒకసారి స్పామ్ మెయిల్స్ రావడం ప్రారంభమైన తర్వాత వాటిని నివారించడమన్నది ఎప్పటికీ జరగని పని. ఇటువంటి అవాంఛిత మెయిల్స్ రాకుండా వుండాలంటే-

మనకు పరిచయంలేని వ్యక్తులకు, వ్యాపార సంబంధ కార్యకలాపాలకు ఇమెయిల్ అడ్రస్ ఇవ్వకూడదు. మీ ఐడీలను ఏ వెబ్‌సైట్‌లలోనూ వుంచకూడదు. ఇతరులను కూడా మీ అడ్రస్‌ను వాటిలో పెట్టనివ్వకూడదు. ఉచిత ఇమెయిల్ సర్వీసులు అందించే యాహూ మెయిల్, హాట్ మెయిల్ మొదలగు వాటిలో కొంతమంది తాత్కాలిక ఇమెయిల్ అకౌంట్లను ఒకటి కన్నా ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఇటువంటి వారు తమ అసలు ఇమెయిల్ అడ్రస్‌ను పూర్తిగా తనకు తెలిసిన వారికి మరియు అవసరమైన వారికి మాత్రమే ఇచ్చి మిగిలిన అకౌంట్లను ఇతరులకు నిస్సంకోచంగా ఇస్తారు. ఒకవేళ ఈ ఐడీల ద్వారా స్పామ్ మెయిల్స్ రావడం మొదలు పెడితే మరో కొత్త ఐడీ క్రియేట్ చేసుకొని పాతదాన్ని వదిలేస్తారు. అంతేకాకుండా వేర్వేరు లావాదేవీలకు వేర్వేరు ఇమెయిల్ ఐడీలు ఉపయోగించే వారు కూడా ఉన్నారు. కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, వ్యాపార సంబంధమైన వ్యక్తులకు వేర్వేరుగా ఇటువంటి తాత్కాలిక ఇమెయిల్ అడ్రస్‌లు ఇవ్వడం వలన మీకు స్పామ్ మెయిల్ వచ్చినపుడు అది ఎవరు పంపివుంటారో ఊహించే అవకాశం వుంటుంది.

స్పామ్ బెడద నుంచి తప్పించుకునే ఉపాయాలు

- మీ ఇమెయిల్ అడ్రస్‌ను యథాతథంగా ఇంటర్నెట్‌లో ఉంచకండి. ఒకవేళ మీ ఇమెయిల్ అడ్రస్ పెట్టవలసిన అవసరం ఏర్పడితే, దాన్ని ముందు వెనకాల చిన్న చిన్న మార్పులతో, లేక అడ్రస్‌నే ముందు వెనుకలుగా మార్చి ఇంటర్నెట్‌లో పెట్టండి.
- స్పామర్లు గూగుల్ వంటి వెబ్‌సెర్చ్ ఇంజన్‌లలో ప్రవేశించిన వెంటనే మీ ఇమెయిల్ అడ్రస్ సులువుగా వారికి కన్పించేలా ఉందేమో గమనించండి.
- చాలా రకాల ISPలు ఉచిత ఇమెయిల్ అడ్రస్‌లను ఇస్తున్నాయి. అందులో మీరు రెండు ఇమెయిల్ అడ్రస్‌లను క్రియేట్ చేసుకొని ఒకటి స్నేహితులకు, సహ ఉద్యోగులకు, బంధువులకు

మెయిల్ చేసేందుకు ఉపయోగించవచ్చు. రెండవ దాన్ని న్యూస్ లెటర్‌లను రాసుకోవడానికి లేక ఫోరమ్స్‌ను పోస్టింగ్ చేయడానికి మరియు ఇతర పబ్లిక్ లొకేషన్ల కోసం వినియోగించుకోండి.

▸ చాలా ISPలు ఉచితంగా 'స్పామ్' ఫిల్టరింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. వీటిని తప్పక ఉపయోగించండి. అయినా మీకు వచ్చే స్పామ్స్ గురించి మీ ISPకి ఫిర్యాదు చేయండి.

▸ న్యూస్ గ్రూప్ పోస్టింగులకు సమాధానాలు రాసేటప్పుడు ఇమెయిల్ ఐడీలను దానికి అనుసంధానించి పంపకండి.

▸ వెబ్‌ఫామ్‌లను నింపుతున్నపుడు ఆ సైట్ ప్రైవసీ పాలసీని తప్పని సరిగా చెక్ చేయండి. ఆ సైట్ మీ మెయిల్ అడ్రస్‌లను ఇతర కంపెనీలకు అమ్మడం కానీ లేక ఇవ్వడం /పంపడం కానీ చేస్తుందేమో పరిశీలించిన తర్వాతనే దాన్ని పూర్తి చేయండి.

▸ మీకు వచ్చే స్పామ్ మెయిల్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతిస్పందించకండి. ఒకవేళ మీరు సమాధాన మిచ్చినట్లయితే, మీ మెయిల్ ఐడీలను తన మెయిలింగ్ లిస్ట్ నుంచి తొలగించమని రిక్వెస్ట్ చేయండి.

▸ మీ సిస్టమ్‌లోని యాంటీ-వైరస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అయ్యేలా చూసుకోండి. ఎన్నో వైరస్‌లు, ట్రోజాన్‌లు మీ హార్డ్‌డిస్క్‌ను ఇమెయిల్ అడ్రస్‌ల కోసం వెదుకుతూ ఉంటాయి. మీరు మీ సిస్టం యొక్క యాంటి వైరస్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా మీ సహచరుల ఇమెయిల్ అడ్రస్‌లు స్పామ్ బారినపడకుండా కాపాడండి.

▸ మీ అకౌంట్ వివరాలు అందజేస్తే తప్ప గుర్తించనటువంటి మెయిల్ అభ్యర్థనలకు ఎట్టి పరిస్థితులలోనూ ప్రతిస్పందించకండి. మీ బ్యాంకు, క్రెడిట్ కార్డు కంపెనీ, ఇ-బే, పేపాల్ మొదలయిన వాటిలో మీ అకౌంట్‌కు సంబంధించిన అన్ని వివరాలు వారివద్దే ఉంటాయి. వాటిని తిరిగి అడిగే అవసరం ఉండదు. ఒకవేళ అవసరం అనుకుంటే ప్రత్యక్షంగా కలవడంగానీ, ఫోన్ ద్వారా గానీ సంప్రదించాలి.



▸ మీ లాగ్ ఇన్ వివరాలను ఇతరులెవ్వరికీ ఎటువంటి పరిస్థితులలోనూ ఇవ్వకండి.

పైన తెలిపిన జాగ్రత్తలను తీసుకోవడంతోపాటు అవసరాన్ని బట్టి సైబర్ సెల్ వంటి వాటిని ఆశ్రయించడం ఒక మార్గమైతే, ఆయా మెయిల్ ఐడిల నుండి వచ్చే మెసేజ్‌లు ఆటోమేటిక్‌గా డిలీట్ అయ్యేలా ఏర్పాటు చేసుకోవడం మరోమార్గం. ఉన్నంతలో ఇది మంచి మార్గంగా అందరూ భావిస్తారు. అయితే ఇది ఎలా ఏర్పాటు చేసుకోవాలన్నదే సమస్య. రెగ్యులర్‌గా మెయిల్స్‌తో తలమునకలై వుండేవారు కూడా ఈ అవాంఛిత మెయిల్స్‌ను ఎప్పటికప్పుడు డిలీట్ చేసుకుంటూవుంటారే గాని శాశ్వత పరిష్కారంవైపు ఆలోచించరు. జిమెయిల్‌లోనే వున్న ఫిల్టర్స్ అనే ఆప్షన్‌ను ఉపయోగించి చికాకు కలిగించే మెయిల్ ఐడిల నుండి వచ్చే మెసేజ్‌లు వాటంతటవే డిలీట్ అయ్యేలా ఏర్పాటు చేసుకోవచ్చు.

జిమెయిల్స్ సెట్టింగ్స్‌లోని ఫిల్టర్స్‌ను ఎలా వుపయోగించుకోవాలో చూడండి. (డింగ్ బిట్స్ వాడదాం)

1. జిమెయిల్‌లోకి లాగిన్ అయిన తర్వాత 'సెట్టింగ్స్' అనే బటన్ ని క్లిక్ చేయాలి.

2. ఆ తర్వాత వచ్చే విండోలో కనిపించే సెట్టింగ్స్ మెనూలో నాల్గవ ఆప్షన్ 'ఫిల్టర్స్'. ఈ బటన్‌పై క్లిక్ చేయాలి.

3. ఇప్పుడు వచ్చే స్క్రీన్‌లో కనిపించే Create a new filter అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.

4. ఇప్పుడు Create a Filter కు సంబంధించిన ఆప్షన్‌తో ఒక స్క్రీన్ వస్తుంది. అందులో 'ఫ్రం' అనే బాక్సులో మీరు ఏ మెయిల్ ఐడి నుండి వచ్చే మెసేజ్‌లను వాటంతతవే డిలీటయ్యేలా సెట్ చెయ్యాలనుకుంటున్నామో ఆ మెయిల్ అడ్రస్‌ని టైప్ చెయ్యాలి. దీని కిందనే వున్న 'సబ్జెక్ట్' ఫీల్డ్‌లో ఏదైనా నిర్దిష్టమైన పదం/వాక్యం 'సబ్జెక్ట్ లైన్'లో వున్న మెయిల్స్‌కి మాత్రమే ఆ ఫిల్టర్ అప్లై చెయ్యబడేలా లేదా అటాచ్‌మెంట్లు వున్న మెయిల్స్‌కు మాత్రమే ఫిల్టర్ అప్లై అయ్యేలా టైప్ చేయాలి. ఇలా మీ అవసరాన్ని బట్టి పలు సెట్టింగులు ఎంచుకోవచ్చు. ఆ తర్వాత చీవక్ష్ హ్వజూ అనే బటన్‌పై క్లిక్ చేయాలి.

5. ఇప్పుడు "ఆ మెయిల్ ఐడి నుండి వచ్చిన మెయిల్ మెసేజ్‌లను చూపడంతోపాటు వాటిని ఏం చెయ్యమంటారో తెలపండి" అంటూ ఓ స్క్రీన్ వస్తుంది. అందులో వరుసగా కొన్ని ఆప్షన్స్ కనిపిస్తాయి. వాటిలో ణవశ్రీవ్వ ట్ అనే బటన్‌పై టిక్ పెట్టి, దాని కిందనే వున్న జతీవ్ఞ్వ ఖీఱశ్రీవతీ బటన్ క్లిక్ చేయాలి.

6. ఒకవేళ మనం డిలీట్ చేయాలనుకుంటున్న మెయిల్ ఐడి నుండి గతంలో వచ్చిన మెసేజ్‌లు ఏమైనా మన 'ఇన్‌బాక్స్'లో వుంటే, పనిలోపనిగా వాటిని కూడా డిలీట్ చెయ్యాలంటే, పైన చెప్పినట్లుగా జతీవ్ఞ్వ ఖీఱశ్రీవతీ బటన్‌పై ప్రెస్ చేసే ముందే క్రియేట్ ఫిల్టర్ పక్కనే వున్న Also apply filter to conversations బటన్‌పై టిక్ చెయ్యండి. ఇక్కడ మనం డిలీట్ చేయాలనుకున్న మెయిల్ ఐడీ నుండి వచ్చిన మెయిల్స్ సంఖ్యనుకూడా చూపుతుంది. ఆ తర్వాత Create Filter అనే బటన్‌పై క్లిక్ చేయాలి.

ఇలా ఫిల్టర్ క్రియేట్ చేసుకున్న తర్వాత ఇకపై ఆ మెయిల్ ఐడి నుండి వచ్చే ప్రతీ మెసేజ్ దానంతట అదే డిలీట్ చెయ్యబడుతుంది. ★





కవిత్వమ్

విశ్వకవి



ఆయన బాల్యం
అందమైన స్మృతులకు
అడుగుజాడగా నిలిచింది!
ఆయన విద్యాభ్యాసం
నాలుగు గోడల నడుమ
బంధీ అయిన
స్వేచ్ఛాభ్యాసాన్ని తట్టిలేపింది
శాంతినికేతన పతాకానికి
శంఖుస్థాపన చేసింది!
ఆయన రచనలు
పాఠకుల స్మృతిపథం మీద కదలాడే
తైలవర్ణ చిత్రాలు!
ఆయన గేయాలు
పసి హృదయపు అమాయక
చూపుల్లోంచి సంధించబడిన
కుతూహల ప్రశ్నలు!
ఆయన కథలు
అట్టడుగు గుండె పొరల్లో
సమాధి కాబడిన మానవత్వానికి
ప్రాణం పోస్తాయి
ఆయన పుస్తక పఠనం అంటే
దేవాలయ ప్రాంగణంలో
ఏంకాంతవాస ప్రసాదం!
ప్రకృతికాంత పొందుకై పరితపిస్తూ
భగ్నప్రేమికుడిగా మారిన
రుషిపుంగవుడు ఆయన
తన సాహిత్య వెలుగును
రవి కిరణంలా వ్యాపింపజేసిన విశ్వకవి!
రవీంద్రుడు

-సోమిశెట్టి వేణుగోపాల్

ప్రశ్న ఎప్పుడూ బలవంతమైనదే
కొన్ని భూమి అట్టడుగు పొరల్లోంచి పుడ్తాయి
మరికొన్ని ఆకలి దేహాల పేగుల ప్రశ్నలు
ప్రశ్న లేనిదే జీవితం లేదు!

ప్రశ్నను పాతిపెడితే
తుపానులా విజృంభిస్తుంది
ప్రశ్నలు ఏకమై వర్షపు జడివానలో
నిజాలని మొలకెత్తిస్తాయి!

ప్రశ్నది - కవిత్వానిది సత్వర బాంధవ్యం
ప్రశ్నలెప్పుడూ చేదుగానే ఉంటాయి
కవిత్వం ప్రశ్నను ఆవాహం చేసుకుని
సమస్త సమాజానికి నిజాల నిప్పులను చల్లుతుంది!

ప్రశ్న



కవిత్వం కేవలం కాగితాలకే
పరిమితమై పోదు... అది
సమాజపు ఉపరితలపు మూలాలను
స్పృశిస్తూ క్షేత్రస్థాయిలో చైతన్యం రగిలిస్తుంది!

సమాజం మొద్దునిద్ర మీద
చల్లటి నీళ్లు గుమ్మరిస్తుంది
నిరాశ, నిస్పృహలతో ఉన్న వారికి
జీవితపు తీయదనం తెలిపేవి
కొన్ని ప్రశ్నలు, మరికొన్ని కవిత్వాలు!

కవిత్వానికి, జీవితానికి
మానవుడే ముడిసరుకు
ప్రశ్నించే మానవుడే
విశ్వకళ్యాణం కోరుకునేవాడు!

- ఇ.వెంకటేష్

సాగిపో నేస్తమా
ముందుకు మున్ముందుకు సాగిపో మిత్రమా
భావాలు పంచుకున్నాం బంధాలు పెంచుకున్నాం
వీడలేక వీడలేక వెళ్లలేక వెళ్లలేక
వేదనతో హృదయాలు బరువెక్కగా కదిలిపోతున్నాం
అల్లరి చేష్టలు, తుంటరి పనులు
ముక్కుమీది కోపాలు, మూగ నోములు
ఎన్నో మధుర జ్ఞాపకాలు... మరెన్నో మధుర స్మృతులు
మనసు పుటల్లో ముద్రించుకున్నాం ॥సాగిపో నేస్తమా॥
తరతరాల వర్గ పోరాటాన్ని సమాజ నగ్న రూపాన్ని
తరగతి గది నాలుగ్గోడల మధ్య తెలుసుకున్నాం
ఈ జీవన పయనంలో మనకంటూ ఒక లక్ష్యాన్ని
నిర్దేశించుకున్నాం
తడబాటు పడక తప్పటడుగు వేయక ॥సాగిపో నేస్తమా॥
కానీ ఒక్కమాట... ఒకే ఒక్కమాట
వెళ్లేది కదన రంగమని
ఆదమరిస్తే అదే మన అంతమని తెలుసుకో
అనుక్షణం అప్రమత్తతతో మసలుకో ॥సాగిపో నేస్తమా॥
నీచేతిలో ఉన్నది కలం
రాజకీయ మదగజాలను అణిచే అంకుశం
అందులోంచి జాలువారే ప్రతి అక్షరం
ప్రజా వ్యతిరేకుల పాలిట కావాలి సింహస్వప్నం
వెలుగుమాటున దాగిన చీకటి కోణాల్ని చేయాలి
ఆవిష్కృతం
సమసమాజ స్థాపన భావాలకు శ్రమజీవులకు
కట్టాలి పట్టం ॥సాగిపో నేస్తమా॥

-రవికుమార్

సాగిపో

స్త్రీల స్థితిగతుల ఆవిష్కరణ



ఉమెన్ అండ్ సోషలిజం (మహిళలు - సోషలిజం).
రచన : ఆగస్టు బెబెల్
ముద్రాపకులు : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ.
వెల : రూ.300.
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

స్త్రీలు, సోషలిజం అనే ఈ గ్రంథం మహిళల స్థితిగతుల్ని ఆదిమ కాలం నుంచి సోషలిస్టు వ్యవస్థ వరకూ వివిధ దశల్లో ఏ విధంగా ఉండేవో సవివరంగా తెలియజేస్తుంది. ఇందులో రచయిత ఆగస్టు బెబెల్ మహిళలు, కార్మికుల స్థితిని పోల్చుతూ తన రచనను ప్రారంభించారు. కార్మికుల స్థితికి మహిళల స్థితి ముందస్తు ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. బానిసలకు బానిసలుగా స్త్రీలు ఏ విధంగా మారిందీ తెలిపారు. కార్మికులు తాము పని చేసే చోట బానిసలుగా ఉండగా స్త్రీలు ఇంటి వద్ద వారికి బానిసలుగా ఉన్నారని ఆయన భావనగా ఉంది. ఆదిమ సమాజం నుంచి మారుతూ వచ్చిన వివిధ దశల్లో మహిళల పరిస్థితులు ఏవిధంగా మార్పు చెందుతూ వచ్చాయో, సోషలిస్టు సమాజంలో వారికున్న శృంఖలాలు ఏ విధంగా తెగిపోయాయో ఇందులో వివరించారు. రచయిత ఈ పుస్తకంలో చారిత్రక గతి తార్కికవాదాన్ని అన్వయిస్తూ వివిధ సమాజాల్లో వచ్చిన మార్పులను చాలా చక్కగా వివరించారు.

దీన్ని 30 అధ్యాయాలుగా విభజించి ఒక్కో అంశాన్ని చాలా విపులంగా చర్చించారు. మొదటి భాగమైన 'గత కాలంలో స్త్రీ' అనే శీర్షికలో ఆదిమ మానవ సమాజం, మాతృస్వామిక సమాజం నుంచి పితృస్వామిక వ్యవస్థలోకి ఎలా మారిందీ, బానిస వ్యవస్థ నుంచి ఫ్యూడల్ వ్యవస్థగా ఎలా మార్పు చెందిందీ, సమాజ గమనంపై చర్చి ప్రభావం వంటి అంశాలను చర్చించారు. పెళ్ళి, విడాకులు, శిశు హత్యలు, గర్భస్రావాలు, ఫ్యూడల్ వ్యవస్థ పెంచి పోషించిన వ్యభిచారం, ఇంకా మహిళలకు సంబంధించిన అనేక సున్నితమైన అంశాలపై బెబెల్ చేసిన విశ్లేషణ ప్రస్తుత కాలానికి కూడా నూటికి నూరుపాళ్ళు నిజమనిపించే విధంగా ఉన్నాయి. పెట్టుబడిదారీ సమాజంలో తమ అవసరాల కోసం పారిశ్రామికవేత్తలు స్త్రీలను ఏ విధంగా ఇళ్ళ నుంచి బయటికి తెచ్చిందీ పేర్కొన్నారు. భార్యాభర్తలిద్దరూ బయటికొచ్చి పని చేయనిదే కుటుంబం గడవని పరిస్థితుల్లో వారిని ప్రమాదకరమైన పరిశ్రమల్లోనూ, పనుల్లోనూ నియమించడాన్ని, ఎక్కువ గంటలు పని చేయించడాన్ని గురించి వివరించారు. స్త్రీలు తెలివితేటల విషయంలో పురుషులకంటే ఏ మాత్రం తక్కువ కాదని, వారికి అవకాశమిస్తే నేర్చుకోలేనిది లేదని బెబెల్ నొక్కి చెప్పారు. పరిపాలనా విషయాల్లో కూడా చరిత్రలో స్త్రీలు ఎంతో సమర్థులుగా నిరూపించుకున్నారంటారు. ఇందులో ముఖ్యంగా ఐరోపా ఉదాహరణలనే తీసుకున్నందున ఇంగ్లండులో రాజుల కంటే రాణులే ఎంత సమర్థవంతంగా పరిపాలన సాగించిందీ బెబెల్ తన గ్రంథంలో వివరించారు. శాస్త్రవేత్తలుగా కూడా వారు ఎంతో పురోగతిని సాధించారని, ముఖ్యంగా వైద్యరంగంలో పురుషుల కంటే స్త్రీలే మంచి పాత్ర పోషించగలరని అంటారు.

వర్గ సమాజంలో ప్రయివేటు ఆస్తి, సంపద అధికారాన్ని నిర్ణయిస్తాయి. దాన్ని నిలబెట్టుకునేందుకు, కాపాడుకునేందుకు ఆ వర్గం తీవ్రంగా ప్రయత్నిస్తుంది. శ్రామిక వర్గం నూతనంగా ఆవిర్భవిస్తున్న వర్గంగా ఉంటుంది. తనను తాను విముక్తి చేసుకోవడమే దాని చారిత్రక కర్తవ్యంగా ఉంటుంది. తనతో పాటే ఇతర అణగారిన వర్గాల విముక్తి కూడా అందులో ఉంది. వాటిలో భాగంగానే స్త్రీ విముక్తి కూడా ఉంటుంది. సోషలిస్టు సమాజంలోనే కార్మికుల విముక్తిలో భాగంగా మహిళలకు కూడా దోపిడీ నుంచి విముక్తి లభిస్తుందని, వారు తమ సామర్థ్యాలను రుజువు చేసుకునేందుకు మార్గం సుగమం అవుతుందని బెబెల్ పేర్కొన్నారు. అది నిజమని నాటి సోవియట్‌లోనూ, నేటి చైనా, క్యూబా, వియత్నాం వంటి దేశాల్లో మహిళలు రుజువు చేసుకుంటున్నారు. మహిళలు చేయలేని పనంటూ ఏదీ లేదని నిరూపిస్తున్నారు. సోషలిస్టు సమాజంలోనే మనిషిపై మనిషి పెత్తనం, కార్మికుడిపై పెట్టుబడిదారుని పెత్తనం రద్దవుతుంది. వేల సంవత్సరాలుగా మానవులు కన్న కలలు సోషలిజం ద్వారానే వారు సాధించగలరని బెబెల్ ఇందులో స్పష్టం చేశారు. చైతన్యవంతులైన స్త్రీల భాగస్వామ్యం లేకుండా ఏ విప్లవమైనా విజయవంతం కావడం కష్టమని ఆయన భావిస్తారు. అందుకే ఆయన మహిళల సమస్యలపై ఎంతో కూలంకషంగా అధ్యయనం చేసి విశ్లేషణాత్మకంగా ఈ గ్రంథాన్ని రచించారు. భవిష్యత్తు సోషలిజానిదేనని, ముఖ్యంగా శ్రామికునిది, మహిళలదేనంటూ ఆయన తన గ్రంథాన్ని ముగించారు. ఇందులో ఆయన తన విశ్లేషణకు బలం చేకూర్చే విధంగా అనేక పట్టికల ద్వారా వివరాలు అందజేశారు. సామాజిక పరిణామక్రమంలో మారుతూ వచ్చిన మహిళల పాత్ర ముఖ్యంగా వారి స్థితిగతులను అధ్యయనం చేయాలనుకొనే వారు తప్పక చదవాల్సిన పుస్తకమిది. ఆంగ్లంలో వున్న ఈ గ్రంథాన్ని సంక్షిప్తంగానైనా తెలుగులో తీసుకొస్తే ఎక్కువమంది మహిళాకార్యకర్తలకు, సాధారణ పాఠకులకు కూడా ఎంతో ఉపయోగంగా వుంటుంది.

- సింహాద్రి సరోజిని

కొత్త పుస్తకాలు



TELANGANA
ARMED STRUGGLE
IN NALGONDA DISTRICT
DR.RAMESH PANNEERU
RS:150/-, PAGES :164
FOR COPICE:
Prajasakti book house
MH bhavan,plot no21/1,
Azamabad, Near RTC
kalyana mandapam,
HYD-20.



MAO ZEDONG
MAN, NOT GOD
BY QUAN YANCHI
RS:200/-, PAGES :213
FOR COPICE:
Prajasakti book house
MH bhavan,plot no21/1,
Azamabad, Near RTC
kalyana mandapam,
HYD-20.



సీరియల్

జరిగినకథ:

తనను చూడ్డానికి వచ్చిన కుయేన్‌తో తాము చేసిన సార్వత్రిక సమ్మె గురించి ఎంతో ఉత్సాహంగా చెప్తాడు ట్రాయ్. తాము చేసిన సమ్మె వల్ల ఒక పట్టణంలోని జనజీవనం స్తంభించడం, విద్యుత్తు, నీటి సరఫరా ఆగిపోవడం గురించి ఉత్తేజపూరితంగా చెప్తాడు. తర్వాత తను రుమాలు మీద ఎంబ్రాయిడరీలాగా కుట్టిన పాటను చూయిస్తుంది కుయేన్. అది చూచి ట్రాయ్ ఆశ్చర్యపోతాడు. ఆమెకు ఇంత చైతన్యాన్ని, విప్లవ స్ఫూర్తిని కలిగించిన వారందరికీ తన తరపున కృతజ్ఞతలు చెప్పమంటాడు. పైగా వారితో కలిసి మరింత చైతన్యం పొందమంటాడు. తర్వాత

వియత్నాం వీరుడు ఎన్ గుయెన్ వాన్ ట్రాయ్

కథనం: ఫాన్-థి-కుయేన్

అనువాదం: పాటూరి రామయ్య

(పదిహేనో భాగం)

చిన్నారి క్యాన్‌తో ఆడుకొంటాడు. తర్వాత పత్రికల్లో వచ్చిన ఒక వార్త ఎంతో ఉత్కంఠను రేకెత్తిస్తుంది.

"టెలిఫోన్ కాల్ : వియత్నాంగ్ ఎన్ గుయెన్ వాన్ ట్రాయ్‌ని ఉరితీస్తే మేమిక్కడ అమెరికన్ కల్నల్ (సైనిక దళాధిపతి)ని ఉరితీస్తాం"

ఆ వార్తలో ఇలా ఉంది.

"వెనిజులా గెరిల్లాలు ఒక అమెరికన్ కల్నలును పట్టుకున్నారు. వియత్నాంగ్ ఎన్ గుయెన్ వాన్ ట్రాయ్‌ని కాల్చి చంపినట్లయితే ఇక్కడ అతణ్ణి మేం కాల్చి చంపుతామని వెనిజులా గెరిల్లాలు ప్రకటించారు. ట్రాయ్‌ని గనుక ఉరితీస్తే ఆ గంటలోపలనే కల్నల్ స్మోలెన్‌ను ఇక్కడ ఉరితీస్తాం.'

ఏమీ తోచక అలాగే నిల్చుండిపోయాను. నాకు నమ్మశక్యం గాకుండా ఉంది.

అప్పుడప్పుడు పత్రికలు ప్రకటించే గమ్మత్తు కాదు గదా ఇది.

ఇరుగు పొరుగు వాళ్ళు కొన్ని పత్రికలు తీసుకొని వచ్చారు. నాకు శుభాశీస్సులు తెలిపారు.

ఒకాయన ఇలా అన్నాడు :

"అతనికి మరణశిక్ష విధించారని తెలుసుకున్నప్పటి నుంచీ నేను చాలా బాధపడ్డాను. ప్చ్! లేత ప్రాయంలో వితంతువు కావల్సి వస్తోంది. ఏం దురంతమిదీ" అని.

ఇంకో అతను –

'ఈసారి అతణ్ణి చంపేయవచ్చునేమో! ప్రజలు రక్షిస్తారని ఎవరనుకుంటారు? అతడు చాలా యోగ్యుడు. వినయవంతుడైన యువకుడు. పాపం! అతడు ఇలాంటి చర్యలు చేస్తాడని ఎవరు నమ్ముతారు? అన్నాడు.

ఒక శీర్షిక ఇలా ఉంది.

"కమ్యూనిస్టుల ఫోన్ కాల్"

ఇంకా సమాచారం తెలుసుకునేందుకు 'వూన్ హూన్ హూవాన్'లో వున్న మా ఇంటికెళ్ళాను. నాకు తెలిసిన ఒకతను గుమ్మంలో నిలబడి సంజ్ఞ చేస్తూ ఇలా అన్నాడు :

'దయచేసి లోపలికి రావాలి. తొందరగా'

వెంటనే లోపలికి వెళ్ళాను.

'చాలా అదృష్టం నీది, అమెరికా రక్షణ మంత్రిని చంపడానికి ట్రాయ్ నాటిన బాంబు పేలకపోయినా అమెరికన్లు మాత్రం అతన్ని చంపడానికి సిద్ధమయ్యారు. కాని చివరి నిముషంలో అది తప్పిపోయింది' అంటూ రెండు పత్రికలు నాకు చూపించాడు.

అతని కుమార్తె అవతలి గదిలోకి నన్ను నెట్టుకెళ్ళింది. నన్ను కౌగిలించుకుని ఇలా అన్నది. : 'కుయేన్ అక్కా! బడిలో మేమంతా చాలా సంతోషించాం. మధ్యాహ్నం ఒక సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ట్రాయ్‌ని గురించి చర్చించాం. ఆయన ప్రపంచానికంతా తెలుసుకదూ! దక్షిణ అమెరికా ఎక్కడ? మనమెక్కడ?'

'ట్రాయ్‌ని అరెస్టు చేసిన సంగతి అంత దూరంలో వున్న ప్రజలు తెలుసుకున్నారు చూశావా? ట్రాయ్‌ని రక్షించడానికి వారు ప్రయత్నించారు. మా బడిలో నా తోటి విద్యార్థిని అన్నది ఆరోజు సైగాన్‌లో ట్రాయ్ భార్య అమితానందం పొందుతుంది. నిజం కదూ?'

ఎం చెప్పాలో నాకేం బోధపడలేదు. ఖచ్చితంగా ఇది నిజమైన వార్తగా నేను నమ్మలేదు. ఆ పిల్ల తృప్తి కోసం చిరునవ్వు నవ్వాను.

ఆమె తండ్రి ఇలా అన్నాడు :

'సరే నా ఆలోచన ఏమీ తప్పు కాలేదు, ట్రాయ్ అప్పుడప్పుడూ మమ్మల్ని చూడ్డానికి ఇక్కడికి వచ్చేవాడు. వాస్తవానికి అతని మాటలు స్ఫురణకు వస్తూనే ఉంటాయి. అబ్బ! ఏం మనిషి అతను! ఇక్కడ తిరుగుతున్న కుర్రాళ్ళకి అతనికి ఏమిటి పోలిక? వాళ్ళ ప్రవర్తనకు ఇతనికీ చాలా భేదం, అమెరికావాళ్ళను ఎత్తిపొడవకుండా ఒక్కమాట కూడా మాట్లాడేవాడు కాదు. ఉత్తర వియత్నాంను గురించి అనేక విషయాలు చెప్పి మమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేసేవాడు.'

నేను ఇంటికి చేరేటప్పటికి ఇరుగు పొరుగు వారంతా నా కోసం చూస్తున్నారు. కొంత దూరం నుంచే హర్షాతిశయంతో అరుస్తున్నారు. నీ భర్తకు స్వాగతం చెప్పి ఇంటికి తీసుకొచ్చేందుకు

సిద్ధమయ్యాం.

ఎంత ఆనందం, ఎంత కోలాహలం!

పూన్ హువాన్ ప్రజలు నిరుపేదలు, చిల్లర సరుకులు వీధుల వెంట తిరిగి అమ్ముకొని పొట్టపోసుకునే వాళ్ళు. వెనిజులా ఎక్కడుండేది వాళ్ళలో ఏ ఒక్కరికీ తెలియదు. ట్రాయ్‌కి ఉరిశిక్ష విధించబడిందని వెనిజులా ప్రజలు తెలుసుకున్నందుకు వీళ్ళంతా బహు ఆశ్చర్యపడ్డారు.

'ట్రాయ్‌ని రక్షించేందుకు ఒక అమెరికన్ ఉన్నత సైన్యాధికారిని ఎలా బంధించగలిగారా?!' అని సంభ్రమాశ్చర్యాలతో ఉప్పొంగిపోతున్నారు. ఆ దేశాన్ని గురించి నన్ను అడిగారు. కాని వెనిజులాను గురించి వాళ్ళకంటే నాకేమీ అధికంగా తెలియదు. ఆ దేశం చిన్నదా? పెద్దదా? పేద దేశమా లేక భాగ్యమైనదో గూడా వాళ్లకు చెప్పలేకపోయాను. ఐతే ఒక్క విషయం మాత్రం నాకు బాగా తెలుసు. దక్షిణ వియత్నాంలో వలెనే అక్కడ గూడా అమెరికాకు వ్యతిరేకంగా గెరిల్లాలు పోరాడుతున్నారు. అందువల్ల అక్కడ ప్రజలు ట్రాయ్ మీద సానుభూతి చూపుతున్నారు.

జనం లోపలికి జొరబడుతున్నారు. అన్ని రకాల పత్రికలు వాళ్ళ చేతుల్లో ఉన్నాయి. ఆ రోజు సైగాన్ పత్రికలన్నీ అధిక సంఖ్యలో అమ్ముడైపోయాయి. పత్రికల్లో పడ్డ వార్తలు ఎప్పుడూ పట్టించుకోని 'ఏ' మావయ్య కూడా 'సాంగ్‌మోయ్' (నవజీవనం) పత్రికను చేతబట్టుకొచ్చాడు.

ఇలా అన్నాడు 'ఏ' మావయ్య :

'కాంగ్లీ బ్రిడ్జి కింద మందు గని నాటిన అతడు ఉరిశిక్ష నుండి రక్షించబడ్డాడని మార్కెట్టులో నేను ముమ్మరంగా చాపలు అమ్ముకుంటున్నప్పుడు విన్నాను. పత్రికలు అమ్ముకునే కుర్రోళ్లు ఈ వార్తను ఇలా పెద్దగా అరుస్తూ ఉన్నారు.

'ప్రత్యేకమైన వార్తలు! ఒక నిండు ప్రాణాన్ని రక్షించిన ఫోన్‌కాల్!' చాలా మంది గొంతుల్లోంచి ట్రాయ్ పేరు ప్రతిధ్వనించింది. నేను వెంటనే ఒక పత్రికను కొన్నాను. నాకు చదువు రాకపోయినా అతని ఫొటోను చూచి సంతోషిస్తున్నాను.'

పనులకు వెళ్తున్న అనేక మంది మధ్యలోనే నిలిచిపోయారు. అత్యవసరంగా వెళ్లే కొంతమంది ట్రాయ్‌ని గురించి రాసిన వ్యాసాన్ని రంగు పెన్సిలుతో గుర్తు పెట్టుకొని మరీ వెళ్ళారు.

నిర్మానుష్యం. గాఢాంధకారం పులుముకున్న మా ఇల్లు కొన్నాళ్ల తర్వాత మళ్ళీ ఇవ్వాళ కిక్కిరిసిన జనంతో కిలకిలా నవ్వుతూ కళకళలాడింది. వెనిజులా ప్రజలు నా భర్త పట్ల చూపిన ప్రేమాదరణలకు సరైన కారణాలు నాకు తెలిసి ఉంటాయని అందరూ నమ్మారు.

ఆ సాయంత్రం 'జడ్' మామయ్యను చూడ్డానికి వెళ్ళాను. ఈ ప్రాణాల మార్పిడి గురించి విశదీకరించి నాకు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తాడని భావించాను. ఆయనకు ట్రాయ్ బాగా తెలుసు. ఈయన గూడా దియమ్ హయాంలో జైల్లో కుక్కబడినవాడే. విడుదలైన తర్వాత కొన్ని వ్యాపార కంపెనీల్లో లెక్కలు చూసిపెడ్తూ జీవితం నెట్టుకొస్తున్నాడు.

ఇలా చెప్పాడు :

'ఈరోజు ప్రపంచంలో ప్రతి చోటా అమెరికన్లకు తీవ్ర వ్యతిరేకత ఎదురౌతున్నది. నన్ను చూడ్డానికి వచ్చినప్పుడల్లా నీ భర్త ఈ విషయాన్నే చర్చిస్తుండేవాడు. అతడు ఇలాంటి విషయాలను నీకేం చెప్పలేదా?

'అవును సైగాన్‌లో మాత్రం అమెరికన్లకు తీవ్ర వ్యతిరేకత ఎదురౌతున్నదని చెప్పాడు. కానీ, ఇతర చోట్ల సంగతి నాకు తెలియదు' అన్నాడు.

'వెనిజులాలో గూడా సరిగ్గా ఇదే జరిగింది. అమెరికాకు ఆ దేశం దగ్గరలో వుండటం వలన అమెరికా దోపిడీకి తీవ్రంగా గురౌతుంది. దానికి చమురు వనర్లు మెండు. ఈ నూనె సంపదనంతా యాంకీలు దోచుకొంటున్నారు. ఈ కారణం వల్ల వెనిజులన్ ప్రజలు యాంకీలను తీవ్రంగా వ్యతిరేకిస్తారు. దక్షిణ వియత్నాంలోవలె వెనిజులాలో కూడా గెరిల్లాలు వున్నారు. అమెరికాకు వ్యతిరేకంగా జాతీయ విముక్తి సంఘటన కూడా అక్కడ ఏర్పడివుంది. వాళ్ళకు మెక్‌సమారా కొత్తవాడేమీ కాదు.

'దక్షిణ వియత్నాంలో మాదిరి అక్కడి ప్రజలను మూకుమ్మడిగా నిర్బంధించడంలోనూ, హింసాకాండ హత్యలు జరిపించడంలోనూ అతడు వాళ్ళకు తెలియనివాడు కాదు. వాడిని మట్టుపెట్టే పథకంలో నీ భర్త విజయం సాధించి ఉండినట్లయితే వెనిజులన్ ప్రజల ఆనందానికి అవధులుండేవికాదు. నీ భర్తను అరెస్టు చేయడం వాళ్ళను దుఃఖ సాగరంలో ముంచింది.

'వెనిజులాలో గూడా జైళ్ళున్నాయి. అక్కడా ఉరిశిక్షలు విధిస్తున్నారు. అయినా దక్షిణ వియత్నాంలో వీటన్నిటికీ గురైన మొట్టమొదటి వాడుగా నీ భర్తను వాళ్ళు గుర్తిస్తున్నారు.'

పటంలో వెనిజులాను చూపించి ఇంకా ఇలా అన్నాడు 'జడ్' మావయ్య :

సైగాన్ ప్రజలకు ప్రత్యేకించి వెనిజులా మీద అభిమానం పెరిగింది. ఆ దేశాన్ని గురించి పూర్తి సమాచారం చెప్పమని నా భార్య గూడ అడుగుతోంది. ఈ రెండు దేశాల ప్రజల మధ్య ఐక్యత, పరస్పర సానుభూతి ఎందుకు అభివృద్ధి అవుతున్నదో తెలుసుకోవాలని ఆమె కుతూహలపడుతోంది.

నేను జైల్లో ఉన్నప్పుడు అప్పుడప్పుడూ వార్డర్లు అక్కడ లేకుండా పోవడం జరుగుతుండేది. అప్పుడు మాకు మంచి అవకాశం చిక్కేది మాట్లాడుకోవడానికి. ఈ అదును చూచి 'ఎక్స్' సోదరి రాజకీయ పరిస్థితులను గురించి మాకు బోధించేది.

అమెరికా వ్యతిరేక పోరాటం సాగిస్తున్న దక్షిణ వియత్నాం ప్రజలకు ప్రపంచ ప్రజలు తమ సానుభూతి, అండదండలు అందిస్తున్నారని చెప్పింది. ఈ విధంగా అందిస్తున్న అండదండలు, సానుభూతి వల్ల కలిగే ఫలితాలేమిటో అప్పుడంతగా నాకు అర్థంకాలేదు. వెనిజులా నుంచి ఈ వార్త రావడంతో సైగాన్ వణికిపోయి నా కళ్ళు తెరిపించింది. ఎక్కడో దూరానవున్న మన మిత్రులు ఇక్కడ మన ప్రజలు సాగిస్తున్న అమెరికా వ్యతిరేక పోరాటాన్ని గురించి తెలుసుకోవడం మాత్రమే గాకుండా పరిస్థితి అతి శ్రద్ధగా గమనిస్తున్నారు.

యాంకీలు దక్షిణ వియత్నాం ప్రజలను క్రూరాతిక్రూరంగా చంపడం వాళ్ళకు తెలుసు.

ఈ విధంగా ప్రపంచ ప్రజలు అందిస్తున్న సహకార, సానుభూతుల ఫలితమే నా భర్తకు కలిగిన ఉపకారం.

ట్రాయ్ పోరాట లక్ష్యం ఒక్క సైగాన్‌కు, దక్షిణ వియత్నాంకు మాత్రమే పరిమితమైంది కాదు. అది ప్రపంచ పీడిత ప్రజలకు సంబంధించిన విప్లవ పోరాటం.

నేను వీధుల్లో నడిచి వెళ్లేటప్పుడు నా హృదయం సగర్వంతోనూ, ఆనందంతోనూ ఉప్పొంగిపోయింది. ఎక్కడో దూరానవున్న లాటిన్ అమెరికా ప్రజలకు, దక్షిణ వియత్నామీయులకు మధ్య ఏర్పడ్డ ఈ బలీయమైన అనుబంధం నన్ను సంతోషాతిశయంతో ముంచెత్తింది.

ఇది నిజం. ఈ సంతోషం నాకొక్కర్తెకే కాదు ప్రతి ఒక్కరూ ట్రాయ్‌కి కలిగిన ఈ అదృష్టాన్నీ, ఆయన భవిష్యత్తును గురించి మాట్లాడుకునే వాళ్ళే. మరణం నుంచి ఆయన తప్పించుకొనడం అందరికీ ఆశ్చర్యకరంగానే తోచింది.

నా మీద గట్టి నిఘాతో పోలీసులు ఉన్నప్పటికీ ఈ శుభవార్తను నా చెవిన పడవేసి, నన్ను సంతోషంలో ముంచి అభినందించేందుకు జనం విరివిగా నా దగ్గరకు వస్తూనే ఉన్నారు. సైగాన్ పట్టణమంతా మూక్కుమ్మడిగా చలించిపోయింది.

పత్రికలమ్ముకునే కుర్రాళ్ళు ఆ సంతోషకర వార్తను ప్రతి ఇంటికీ తెలియజేయాలన్న ఆకాంక్షతో పెద్దగా అరుస్తూ వీధుల్లో పరుగులు తీస్తూ వెళుతున్నారు.

'మెక్‌సమారాను మట్టుబెట్టేందుకు ప్రయత్నించినతని ప్రాణం రక్షించబడింది' ఇలా బిగ్గరగా అరుస్తున్నారు వాళ్ళు.

కోర్టులో చిరునవ్వుతో నిలబడి వున్న ట్రాయ్ ఫొటోను ప్రచురించివున్న పత్రికను టోపీగా చేసి తలకు తగిలించుకున్నాడు ఆ కుర్రాళ్ళలో ఒకడు.

(మిగతాభాగం వచ్చేవారం)

మన బాక్సాఫీస్ రికార్డుల్లో అసలెంత? కొసరెంత?



ఏ రంగంలోనైనా ఏ ఉత్పత్తికైనా విజయం కోసం చూస్తారు. ఎలాగైనా గెలుపు సాధించాలని తపిస్తారు. కానీ, విజయం సాధించకుండానే, తమను తాము విజేతలుగా ప్రకటించేసుకుంటూ, లేని గొప్పలు చెప్పకుంటూ గడిపేసే సంస్కృతి మీరెన్నడైనా చూశారా? దానినే చరిత్రగా చలామణీ చేసే చాతుర్యం ఎక్కడైనా గమనించారా? ఈ లక్షణాలు ఇతర పరిశ్రమల్లో కన్నా ఎక్కువగా కనిపించే పరిశ్రమ ఒకటి ఉంది. అదే- మన చిత్ర పరిశ్రమ. రాని రికార్డును అసలు సిసలు బాక్సాఫీస్ చరిత్రగా పుస్తకాల్లోకి ఎక్కించడానికి బహుశా, తెలుగు చిత్ర పరిశ్రమలో జరుగుతున్నంత ప్రయత్నం మరెక్కడా కనిపించదు.

- రెంటాల జూనియర్

ప్రత్యర్థి హీరో కన్నా తమ హీరో చిత్రం ఎక్కువ కేంద్రాల్లో శతదినోత్సవం, రజతోత్సవం, ద్విశతదినోత్సవం జరుపుకోవడం కోసం అగ్రహీరోల అభిమానులు శాయశక్తులా కృషి చేస్తున్నారు. ఆ ప్రయత్నంలో భాగంగానే, రికార్డు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ఆఖరు అంచెలో వెనుకబడిన తమ హీరో చిత్రాలకు తామే ఎదురు డబ్బులు పెట్టి, ఆడించే వ్యవహారాలు పెరిగాయి.

ఎప్పటి నుంచో ఉన్నదే!

నిజానికి, ఏయన్నార్ చిత్రాల రోజుల నుంచి ఇలాంటి సంఘటనలు జరిగాయి. కానీ, 1980ల చివర నుంచి ఈ రికార్డుల వ్యామోహం వేలంవెర్రి అయింది. ఇక, 1990ల మధ్య నాటి తరువాత ఉపగ్రహ టీవీ చానళ్ళ దెబ్బతో సినీ రికార్డుల స్వరూపమూ మారింది. సినిమా ఎన్ని రోజులు ఆడిందన్న దాని కన్నా ఎంత వసూలు చేసిందన్నది ముఖ్యమై కూర్చుంది. ఫలితంగా, వసూళ్ళలో తమ సినిమా రికార్డంటే తమ సినిమా రికార్డనే పోటీ వచ్చిపడింది.

1990ల ద్వితీయార్ధంలో ఉపగ్రహ తెలుగు టీవీ చానళ్ళు ప్రవేశించి, తెలుగు సినిమా ప్రేక్షక సరళిపై గట్టి ప్రభావం చూపాయి. పెట్టిన పెట్టుబడిని ఎంత త్వరగా రాబట్టుకోగలమా అనే వైఖరి తెలుగు సినీ వ్యాపారంలోకి వచ్చి చేరింది. ఈ పరిస్థితుల్లో సినిమాను వీలైనన్ని ఎక్కువ ప్రింట్లతో, దేశవిదేశాల్లో వీలైనన్ని ఎక్కువ కేంద్రాల్లో విడుదల చేసి, గబగబా సొమ్ము చేసుకోవాలనే ఫార్ములా వచ్చింది. ఉన్నవీ, లేనివీ థియేటర్ల సంఖ్యను కూడా చేర్చి, 'అమెరికాలో ఇన్ని హాళ్ళలో', 'బ్రిటన్‌లో ఇన్ని హాళ్ళలో', 'ఇవి కాక యు.ఎస్.లో ఇంకా ఇన్ని కేంద్రాల్లో' అంటూ సినిమా పత్రికల్లో ప్రకటనలు వేసే సంస్కృతి పెచ్చు మీరింది.

హాళ్ళ సంఖ్యలోనూ అసత్యాలే!

నిజానికి, తెలుగు సినిమా విడుదలకు సంబంధించి చిన్నా పెద్దా అన్నీ కలుపుకొని రాష్ట్రంలో ఉన్నవే దాదాపుగా 250 నుంచి 300 కేంద్రాలు. కానీ, మన తెలుగు సినిమా వందలాది ప్రింట్లతో, వేలాది హాళ్ళలో దేశ విదేశాల్లో విడుదలవుతున్నట్లు చెప్పేస్తుంటారు. విడుదలైన కేంద్రాలు, హాళ్ళ సంఖ్యలో సత్యాసత్యాల మాట ఇలా ఉండగా, బాక్సాఫీస్ వద్ద ఏ అగ్ర హీరో సత్తా ఎంత అనేది మరో రికార్డుల పందేనికి దారి తీసింది. ప్రారంభ వసూళ్ళే సినిమాకు ప్రాణవాయువుగా మారిన పరిస్థితుల్లో, అగ్ర హీరోల ఫ్లాప్ చిత్రాలకు సైతం తొలి వారాల కలెక్షన్ల గురించి గోబెల్స్ ప్రచారం ఎక్కువైంది. అగ్ర చిత్రాల పౌర సంబంధాల అధికారులు (పి.ఆర్.ఓలు) తమ సొంత పత్రికలతో పాటు, చెప్పుచేతల్లోని ఇతర సమాచార సాధనాలతో కూడా ఈ అబద్ధాలను నిజాలుగా చలామణీలో పెట్టేస్తున్నారు.

నిజానికి, రికార్డుల కోసం ఆరాటం పాత రోజుల నుంచి వస్తున్నదే! హాలులోని వసూళ్ళను పర్సంటేజి పద్ధతిలో ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్ పంచుకొనే ఆ రోజుల్లో ఏయన్నార్ చిత్రాల్లో కొన్ని ఇలానే శతదినోత్సవాలు జరుపుకొన్నాయంటారు. హీరో నుంచి, సదరు చిత్ర పంపిణీదార్ల నుంచి ఒత్తిడి, మొహమాటాల మేరకు జనం లేని సినిమాను సైతం ఎగ్జిబిటర్లు కొన్నిసార్లు వంద రోజుల దాకా లాగించేవారు. అందుకు ప్రతిఫలంగా, అలా బలవంతాన ఆడించే వారాల్లో నికర వసూళ్ళు (నెట్) మొత్తం ఎగ్జిబిటర్లకే వదిలేసేవారు. దానిలో మామూలుగా తనకు ఉండే వాటాను పంపిణీదారు వదిలేసుకునేవాడు. ఆ తరువాత హీరో కృష్ణ చిత్రాలకూ, హీరో శోభన్‌బాబుకు భాగస్వామ్యం ఉన్న చిత్రాలకూ ఇలా బలవంతాన సినిమా ఆడించే పద్ధతులు కొనసాగాయి.

జనం లేకున్నా 'హౌస్‌ఫుల్' బోర్డు

ఇక, 1980ల నాటి చిరంజీవి చిత్రాల నుంచి ఈ ధోరణి పెచ్చరిల్లిందని చెబుతారు. అనివార్యంగా ఒకరి రికార్డును మరొకరు ఎలాగోలా తిరగరాయాలనే పిచ్చిపోటీ పెరిగింది. నిండని హాలుకు కూడా హౌస్‌ఫుల్ బోర్డు వెలిసే ఈ విపరీత సంప్రదాయం తరువాతి హీరోలైన నాగార్జున, వెంకటేష్ మొదలు ఇవాళ్టి పవన్ కల్యాణ్, మహేష్‌బాబు చిత్రాల దాకా నడుస్తూనే వచ్చింది. ఇక – ఏ హీరో సినిమా ఎన్ని చోట్ల శతదినోత్సవాలు, మరెన్నిచోట్ల రజతోత్సవాలు జరుపుకుందనే అనవసరపు పోటీ లెక్క కూడా పరిశ్రమను పాడుచేస్తోంది. బాలకృష్ణ నటించిన 'సమరసింహారెడ్డి' (1999) అప్పట్లో 30 కేంద్రాల్లో రజతోత్సవాలు జరుపుకొంది. ఆ తరువాత ఆయనే నటించిన 'నరసింహ నాయుడు' (2001) సంక్రాంతి చిత్రాల పోటాపోటీలో ఘనవిజయం సాధించి, 102 కేంద్రాల్లో శతదినోత్సవాలు, 18 కేంద్రాల్లో రజతోత్సవాలు చేసుకుంది. దాంతో, ఈ రికార్డును దాటే క్రమంలో మెగాతార చిరంజీవి 'ఇంద్ర' (2002) చిత్రం 114 చోట్ల వంద రోజులు, 32 దాకా కేంద్రాల్లో సిల్వర్ జూబ్లీలు నడవాల్సి వచ్చింది. అలా ఇది అంతులేని వింత పరుగుగా తయారైంది.

పదేళ్ళుగా పెరిగిన వెర్రి

అగ్రాసనంపై కూర్చున్న పెద్ద హీరోలకూ, ఆ పీఠాన్ని అందుకోవాలని యత్నిస్తున్న నవతరం

హీరోలకూ మధ్య పోటీ వాతావరణం సహజంగానే ఈ రికార్డుల రేసును మరింత వేడెక్కించింది. చిన్న ఎన్టీయార్ 'సింహాద్రి', చిరంజీవి 'ఠాగూర్' చిత్రాల సమయంలో 2000ల ప్రథమార్థంలో ఈ పోటాపోటీ సినీరంగంలో బహిరంగ రహస్యమై కూర్చుంది.

కాగా, మెగాతారగా పేరు తెచ్చుకున్న చిరంజీవి రాజకీయాల్లోకి వెళ్ళడంతో, అగ్రస్థానం కోసం పోటీ తీవ్రమైంది. ఈ పరిస్థితుల్లో చిరంజీవి కుమారుడు రామ్‌చరణ్ తేజ నటించిన 'మగధీర' వసూళ్ళలో 'పోకిరి'ని దాటి, సరికొత్త ఇండస్ట్రీ రికార్డుగా నిలిచింది. ఆ చిత్రం 215 పైచిలుకు కేంద్రాల్లో శతదినోత్సవ ప్రకటన వేసుకుంది. ఆ పైన 365 రోజుల రికార్డును అందుకుంది. ఇప్పుడిక ప్రదర్శితమైన రోజుల సంఖ్యలో కూడా 'పోకిరి' రికార్డును (కర్నూలు లోనే మొత్తం 561 రోజులు) దాటే ప్రయత్నం తాజాగా జరుగుతోంది. 'పోకిరి' కర్నూలులో మొత్తం 561 రోజులు ఆడినట్లు రికార్డు. ఇప్పుడు ఎలాగైనా దాన్ని అధిగమించాలని 'మగధీర' ప్రయత్నం.

రికార్డుల కోసం కొత్త వ్యూహం

నిజం చెప్పాలంటే, 561 రోజుల 'పోకిరి' ప్రదర్శన వెనుక కూడా బోలెడంత కథ నడిచింది. 2006లో విడుదలైన మహేష్‌బాబు 'పోకిరి' చిత్రం 75 ఏళ్ళ తెలుగు చలనచిత్ర రికార్డులను తిరగరాస్తూ, రూ. 40 కోట్ల పైగా వసూళ్ళు సాధించింది. కర్నూలులోని శ్రీరామ 70 ఎం.ఎం. థియేటర్‌లో రోజూ నాలుగు ఆటలతో ఈ చిత్రం 176 రోజులు నడిచింది. ఆ పైన దాన్ని ఎలాగైనా ఏడాది పై చిలుకు ఆడించి, రికార్డు సృష్టించాలని అభిమానులు అనుకున్నారు. అందుకు అనువుగా దిగువ శ్రేణి హాలు 'భగీరథ'ను ఎంచుకున్నారు. అలా జనమున్నా, లేకున్నా 2007 మే తొలి వారంతో కర్నూలులో 'పోకిరి' 365 రోజులు ఆడినట్లయింది. ఆ తరువాత కూడా ఆ పద్ధతిని కొనసాగించారు. అలా ఆ హాలును గుదిగుత్త మొత్తానికి అద్దెకు తీసుకొని, అక్కడ రోజుకు 4 ఆటలనే పోస్టర్‌తో ఆ ఒక్క హాలులోనే 385 రోజులు నడిపించారు. అలా సింగిల్ థియేటర్ ప్రదర్శనలో రికార్డు సృష్టించారు. వెరసి, 'పోకిరి' 561 రోజులు ఆడిందంటూ, బలవంతపు బాక్సాఫీస్ రికార్డును స్థిరపరిచారు. కుహనా రికార్డుల కొనసాగింపు



మహేష్‌బాబు 'పోకిరి' చిత్రానికి అభిమానులు అనుసరించిన పద్ధతే, గత ఏడాది విడుదలైన రామ్‌చరణ్ తేజ 'మగధీర' చిత్రానికీ ఇప్పుడు అనుసరణీయమైంది. కర్నూలులోని ఆనంద్ థియేటర్‌లో 'మగధీర' మొదట 110 రోజులు ఆడింది. ఆ తరువాత హాళ్ళు మారుతూ, 200 రోజులకు చేరుకుంది. ఆ సమయంలో 'పోకిరి' కర్నూలులోని భగీరథ థియేటర్‌లో 561 రోజులు ఆడినట్లుగానే, అంతకన్నా ఎక్కువ రోజులు 'మగధీర'ను ఆడించే ప్రయత్నం మొదలైంది. కర్నూలులోని 'వెంకటేశ - భగీరథ - లక్ష్మి' అనే మూడు థియేటర్ల కాంప్లెక్స్‌లో 'పోకిరి'కి భగీరథ హాలు అక్కరకొస్తే, 'మగధీర'కు లక్ష్మి థియేటర్ అండ అయింది. ఇదే అదనుగా అభిమానులు గుదిగుత్తగా కొంత మొత్తం చెల్లించి, ఈ హాలును అద్దెకు తీసుకున్నారు. దాంతో లోపల చిత్ర ప్రదర్శనైతే జరగదు కానీ, హాలు బయట 'మగధీర' పోస్టర్ అలా నిరంతరాయంగా కొనసాగుతూ ఉంటుంది. అన్ని రోజులూ ఆ సినిమా ఆడినట్లు లెక్క చూపెడతారు.

మూలపడిన హాళ్ళకు మంచి బేరం

కాగా, ఈ గుదిగుత్త అద్దె మూలపడిన హాలు యజమానులకు కూడా వాటమైన వ్యవహారమే. హాలును పూర్తిగా మూసివేసుకుని, పైసా కూడా ఆదాయం లేకుండా చేసుకునే కన్నా ఇది వారికి నికరమైన ఆదాయమిచ్చే మార్గంగా తయారైంది. దాదాపు మూసివేతకు సిద్ధంగా ఉన్న సినిమా హాళ్ళు (కుహనా) రికార్డుల కోసం అభిమానులు పడుతున్న తాపత్రయాన్ని ఆసరాగా చేసుకొని, మంచి ఆఫర్లతో ముందుకు వస్తున్నాయి. హాలులోని సీట్లన్నిటికీ పన్ను కట్టాల్సిన శ్లాబ్ పద్ధతి పోయి, అమ్మిన టికెట్లకే పన్ను కట్టే వినోదపు పన్ను విధానం రావడం అభిమానులకు అవకాశమై కూర్చుంది.

ఉచిత సినిమా! ఉచిత సమోసా!!

ఆ మధ్య కిరణ్ తేజ అనే యువకుణ్ణి హీరోను చేస్తూ, ఆయన కుటుంబసభ్యులు నిర్మించిన 'బ్రహ్మ' (2007) చిత్రం దీనికి బ్రహ్మాండమైన ఉదాహరణ. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ 'సాయిరాజా' థియేటర్‌లో 'బ్రహ్మ' చిత్రాన్ని అప్పట్లో 50 రోజులు ఆడించినట్లు భోగట్టా. ఆ దారినపోయే వాళ్ళకు ఉచితంగా టికెట్లిచ్చి లోపలకు పంపేస్తూ, అర్ధశతదినోత్సవం అయిందనిపించారు. దాంతో తృప్తిపడక ఆ తరువాత ఏకంగా శతదినోత్సవం కోసం హాలుకు మళ్ళీ కొంత ముట్టజెప్పి, జనం లేని సినిమాను నడిపించే ప్రయత్నం చేశారు.

'మా గతి ఏమిట'ని హాలులోని క్యాంటీన్ వాళ్ళు గోల పెట్టడంతో, వాళ్ళకూ డబ్బు ఇచ్చేసి, ప్రేక్షకులకు ఉచితంగా సమోసాలు ఇచ్చే ఏర్పాటు చేశారు. అంటే, ఆ దారిన పోయే జనానికి 'ఉచిత సినిమా, ఉచిత సమోసా పథకం' అన్న మాట!



అట్టర్ ఫ్లాపులకూ, అమోఘ హిట్లకూ అదే రికార్డులు

అడపాదడపా అగ్రహీరోల ఫ్లాప్ చిత్రాలకూ ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు. బాలకృష్ణ నటించిన 'మహారథి' (2007) లాంటి అట్టర్ ఫ్లాప్‌ను సైతం అనంతపురం జిల్లా కదిరిలోని మౌనిక హాలు వారితో అభిమానులు ఒప్పందం కుదుర్చుకొని, వంద రోజులు ఆడిందనిపించారు. విశాఖపట్నంలోని గోపాలపట్నం ప్రాంతంలో నెలకొన్న 'మౌర్య' (డీలక్స్) హాలులో 'సింహ' (2010) సినిమా తాజాగా ఈ బలవంతపు పద్ధతిలోనే గత నవంబర్‌లో 203 రోజులు దాటేసింది. ఆ హాలులో గతంలో 'మగధీర' చిత్రం 189 రోజులు ఆడింది. ఆ రికార్డును తిరగరాయడం కోసమే ఇప్పుడు ఈ 'సింహ'ను ఇలా ఆడించారన్నది బహిరంగ రహస్యం.

ఈ వ్యవహారంలో కేవలం హాలు వాళ్ళను తప్పు పట్టి ప్రయోజనం లేదు. మారిన తెలుగు సినిమా వ్యాపార స్థితిగతుల నేపథ్యంలో వేరే గతిలేక, హాలును మూసేయలేక, కొత్త సినిమాలను తెచ్చి ఆడించేందుకు పెద్ద మొత్తాల్లో షేర్ గ్యారెంటీలు కట్టలేక సినిమా హాలు వాళ్ళు ఇలా గుదిగుత్త అద్దెతో, లేనిపోని రికార్డులకు ఆస్కారమిస్తున్నారు. నేటి తెలుగు సినీ పరిశ్రమ దుస్థితికి ఇది నిదర్శనం.

ఈ డబ్బంతా ఎక్కడిది?

వెరసి తెలుగు సినిమాలకు సాగుతున్న బాక్సాఫీస్ రికార్డుల ప్రచారం అసలు సత్యానికి అమితమైన దూరంలో ఉంటోంది. అభిమానులకు కూడా ఈ రికార్డుల వ్యవహారంతో చేతి చమురు చాలానే వదులుతోంది. కాగా, తెలుగు నాట చదువుకుని విదేశాలకు వెళ్ళి, సాఫ్ట్‌వేర్ తదితర రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళు సైతం ఈ రకమైన కుహనా రికార్డులకు 65 నుంచి 75 శాతం దాకా నిధులు సమకూరుస్తుండడం గమనార్హం. అయినా, మన హీరోలు, అభిమానుల పిచ్చి గానీ, సినిమా తెచ్చిపెట్టిన లాభాలే తప్ప, తెచ్చిపెట్టుకున్న రికార్డులతో అగ్రస్థానం ఎవరిదో చెప్పగలమా? సామాజిక వర్గాల ప్రాతిపదికన సినిమానూ, కళనూ సంకుచితంగా చూడగలమా? ★

చూద్దామా

గులాబి నగరం అందాలు... నీలి నగరం చందాలు...

రాజస్థాన్ అనగానే మన మదిలో అద్భుతమైన రాజభవనాలు మెదులుతాయి. చిన్నప్పుడు చదువుకొన్న చరిత్ర పాఠాలు, రాజుల విజయగాథలు, రాజపుత్ర స్త్రీల సాహసకృత్యాలు గుర్తొస్తాయి. సూర్యకిరణాలకు పుత్తడిలా మెరిసిపోయే ఇసుకతెన్నెలు, లయబద్ధంగా నడిచే ఎడారిఓడలు... పల్లగా మనోఫలకంపై కదలాడతాయి. నాటి రాజుల కళాభిరుచికి, శిల్పుల నైపుణ్యానికీ నిలువెత్తు సాక్ష్యాల్లా రాజభవనాలు దర్శనమిస్తాయి. అన్నిటిలోకి గులాబినగరం, నీలి నగరం సోయగాలు మర్చిపోతామా! అవేనండీ జైపూర్, జోధ్‌పూర్ పట్టణాలు. మరి ఒళ్లుగగుర్పొడిచే చరిత్రకు సాక్ష్యంగా నిల్చిన రాజస్థాన్ వెళ్లొద్దామా...

సిటీ ప్యాలెస్

'భారతదేశ చరిత్రపట్ల, సంస్కృతిపట్ల మక్కువ ఎక్కువ' అని చెప్పేవారెవరైనా సరే రాజస్థాన్ అందాలు వీక్షించాల్సిందే. చరిత్రలో చదివిన రాజపుత్రవీరుల వీర చరితలకు నిదర్శనాలైన అక్కడి కోటలు, కట్టడాల అందాలను ఆస్వాదించాల్సిందే.

గులాబి నగరం

జైపూర్ గులాబి నగరంగా పేరొందింది. అదేనండీ 'పింక్ సిటీ'. ఇది మన దేశంలోకల్లా అత్యంత అందమైన నగరాల్లో ఒకటి. పర్యాటకులను ప్రధానంగా ఆకర్షించేది 'సిటీ ప్యాలెస్'. ఆకాశాన్నంటే రాజభవనాలను చూస్తుంటే కనురెప్ప వేయడం కూడా మర్చిపోతాం. నాటి రాజుల దర్పానికి నిలువెత్తు నిదర్శనాలివి. వాటి అందాలను నోటితో వర్ణించడమంటే పెద్ద సాహసమే. చూసి తీరాల్సిందే.

ఇక్కడ హెరిటేజ్ హోటళ్లూ, పార్కులూ, ఉద్యానవనాలూ చాలా కనిపిస్తాయి. ఈ ఆధునిక యుగంలో అడుగడుగునా సంప్రదాయం తొంగిచూస్తుంటుంది. అలాగని ఆధునికతను అడ్డుకుంటుందని కాదు. దానికీ ఆహ్వానం పలుకుతూనే వుంటుంది. ఇప్పటికీ గుర్రపు బగ్గీలూ, ఒంటె సవారీలూ దర్శనమిస్తుంటాయి. అయితే రయ్యిమని దూసుకెళ్లే వాహనాల పక్కనుంచి వీటిమీద ప్రయాణం చేయాలంటే కూసింత సిగ్గుపడే వారూ వుంటారనుకోండి. అయితే జైపూర్ వెళ్లినవారు మాత్రం తప్పనిసరిగా ఒక్కసారైనా వీటిమీదెక్కి వీధుల్లో ప్రయాణించాల్సిందే. అదో అనిర్వచనీయమైన అనుభూతి మరి. చేజేతులారా వదులుకుంటామా చెప్పండి. అయితే ఒంటెమీద ఎక్కి కూర్చుని మహారాజుల్లా ఫీలయిపోయే వారూ మనకు కనిపిస్తుంటారు. అలా మెల్లగా వీధిలో వెళుతూ... రాజస్థానీ ప్రజలను చూస్తుంటే వుంటుందీ! నిజంగా రాజులకాలం నాటికి వెళ్లిపోతాం. ముఖ్యంగా రాజస్థానీ మహిళలు ! చేతి గాజులు మొదలుకొని, మెడలో ఆభరణాలు, వస్త్రాల వరకు అన్నీ తమ ప్రాంతీయ సంప్రదాయానికి ప్రతీకలుగా అలంకరించుకొంటారు. కళ్లు చెదిరిపోయే రంగు బట్టలు ధరించడమంటే వీరికి అమిత ఇష్టం. పురుషులూ తక్కువ కాదు. రంగురంగుల వస్త్రాలతో తలపాగాలు చుట్టుకొని మీసాలు మెలేస్తూ భలే స్టయిల్‌గా నడుస్తుంటారు.

ఇక్కడ చూడాల్సిన మరో ముఖ్యమైనది మ్యూజియం. దీని ప్రవేశ ద్వారం వద్ద పాలరాతితో చేసిన రెండు పెద్ద ఏనుగులు పర్యాటకులకు స్వాగతం పలుకుతాయి. ఎంతో అపురూపమైన సంపదని ఈ మ్యూజియంలో భద్రపరిచారు. ఇందులోని నేలంతా పర్షియా, ఆఫ్ఘన్ కార్పెట్లతో నిండిపోయి ఉంటుంది. ఇక గోడలు అద్భుతమైన చిత్ర కళతో కళకళలాడుతుంటాయి. ఆనాటి రాజకుటుంబీకులు ధరించిన అనేక రకాలైన దుస్తులను ఇక్కడ చూడొచ్చు.

సిటీ ప్యాలెస్ సొగసులు...

సిటీప్యాలెస్ లోపలంతా తిరిగి చూస్తుంటే ఎటు వెళ్తున్నామో తెలియదు. ఓ పెద్ద పజిల్ లాగా ఉంటుందీ కోట. అప్పట్లో శత్రువుల దాడిని ఎదుర్కోడానికి ఇలా నిర్మించారు కాబోలు. దీని నిర్మాణంలో మొఘలుల శైలి ప్రతిబింబిస్తుంది. ఇది ఏడంతస్తుల నిర్మాణం. ఈ కోటలోని కిటికీలు, పెద్ద పెద్ద తలుపులు... వాటిపై చెక్కిన చిత్ర కళను చూస్తే 'ఎంతటి చేయి తిరిగిన శిల్పి చేశాడీ మాయ' అని అనిపించక మానదు.



ప్యాలెస్‌లోని చిత్రాలు

హవామహల్



ఉమెద్ భవన్ ప్యాలెస్

ఉమెద్ భవన్ ప్యాలెస్‌లోపలి భాగం

మ్యూజియం

ఈ కోటలో ముఖ్యమైనది చంద్ర మహల్. ఇందులోనే రాజ కుటుంబం నివసించింది. ఈ మహల్ గోడలపై మహరాజా ప్రతాప్ జీవిత ఘట్టాలు చిత్రించారు. ఇవే కాకుండా అతను ఉపయోగించిన మార్బుల్ సింహాసనం, యుద్ధంలో ఉపయోగించిన ఆయుధాలు, అతని గుర్రం ధరించిన కవచం కూడా ఈ చిత్రాల్లో ఉన్నాయి.

కోట పై భాగానికి వెళ్లి నగరాన్ని చూస్తే చాలు... ఎంత అద్భుతమైన నగరమిది అని అనిపించక మానదు. చుట్టూ కనుచూపు మేరలో ఎక్కడ చూసినా గులాబీ రేకలు పరిచినట్లు కనిపిస్తుంది. ఇక్కడి భవనాలన్నీ గులాబీ రంగులోనే ఉన్నాయి.

స్థానికులు దీనికి ఒక కథ చెప్తారు. జైపూర్ నగరాన్ని 17 శతాబ్దంలో నిర్మించారు. ఈ నగరాన్ని నిర్మించింది బెంగాల్‌కు చెందిన విద్యాధర భట్టాచార్య. అప్పట్లో ధనికులు తమ భవనాలు అందంగా కనిపించాలని, ఎంతో ఖరీదైన గులాబీ రంగు రాళ్లతో నిరించారు. వేల్స్ రాజైన ఏడవ ఎడ్వర్డు జైపూర్‌ను దర్శించుకుందామని వచ్చాడు. అక్కడ అతనికి గులాబీ రంగులోని భవనాలు ఎంతగానో ఆకర్షించాయి. నగరం మొత్తం ఇదే రంగులో ఉంటే ఎంత బాగుంటుందో అని అనిపించింది. వెంటనే అన్ని భవనాలకూ గులాబీ రంగు వేయాలని ఆజ్ఞాపించాడు. అప్పటి నుండి అదే విధానాన్ని కొనసాగిస్తున్నారు అక్కడి ప్రజలు. ఇప్పటికీ ఈ పద్ధతి అమల్లోనే ఉంది. ఇక్కడ ఎండలు ఎక్కువ కాబట్టి ఈనగరాన్ని 'సన్ సిటీ' అని కూడా అంటారు.

ఈ కోటకు కిలో మీటరు దూరంలో జస్వంత్ తాడా ఉంది. ఇక్కడే రాజుల సమాధులు కట్టారు. ఇవన్నీ ఎంతో పలుచగా ఉన్న చలువరాయితో నిర్మించారు. ఇందులో అన్నింటికంటే పెద్దది రాణా సమాధి.

ప్యాలెస్ ఆఫ్ విండ్స్

దీన్నే హవామహల్ అనికూడా పిలుస్తారు. 18వ శతాబ్దం ఆరంభంలో దీని నిర్మాణం జరిగింది. దీన్ని కూడా గులాబీ రంగు రాళ్లతోనే నిర్మించారు. సూర్యకాంతిలో గులాబీల పరదా కప్పుకున్నట్లున్న ఈ మహల్‌ను చూడ్డానికి రెండు కళ్లు చాలవు. ఈ మహల్లో మొత్తం 593 కిటికీలున్నాయి. ఈ కిటికీల్లో నుండే ఆనాటి రాణివాసపు స్త్రీలు వీధుల్లో జరిగే ఉత్సవాలను, ఊరేగింపులను తిలకించేవారు. అందుకు అనువుగా దీన్ని అయిదంతస్తులుగా నిర్మించారు. ఇందులో ఎంతో విశాలంగా ఆర్చీలతో తీర్చిదిద్దిన బాల్కనీలు చూడముచ్చటగా వుంటాయి.

హవామహల్ సిటీ ప్యాలెస్ పశ్చిమాన ఉంటే, ఈశాన్య దిక్కున నహర్ ఘర్ కోట ఉంది. దీన్ని 17వ శతాబ్దంలో రెండో జైసింగ్ తన రాణుల కోసం నిర్మించాడు. ఇందులో భవనం మధ్యభాగం నుండి వర్తులాకారంలో గదులను నిర్మించారు.

ఇక్కడ రాజప్రాసాదాలే కాదు, ప్రకృతి దృశ్యాలూ అత్యద్భుతంగా ఉంటాయి. దేవాలయాలమీది శిల్ప కళ చూపరులను మంత్ర ముగ్ధులను చేస్తుంది. రెండున్నర శతాబ్దాల క్రితం కట్టిన దేవాలయాల్లో సూర్య దేవాలయం ఒకటి. దీనికి దగ్గర్లోనే రాతి ట్యాంకుల్లోని నీటినే సందర్శకులు తాగడానికి ఉపయోగిస్తారు.

జైపూర్ బంగారు ఆభరణాలకు, జాతి రాళ్లకు, ఎనామిల్ పెయింట్‌కు పెట్టింది పేరు. త్రిపోలియా బజార్ లో అలంకరణ వస్తువులు, రాజస్థానీ దుస్తులు, ఒంటె చర్మంతో తయారు చేసిన చెప్పులు, ఆకర్షించే పాలరాతి బొమ్మలు సందర్శకులను ఇట్టే ఆకట్టుకుంటాయి.

నీలి నగరం

జైపూర్ తర్వాత చూడాల్సిన మరో ముఖ్యమైన ప్రదేశం జోధ్‌పూర్‌లోని ఉమెద్ భవన్ ప్యాలెస్. ఇక్కడి ఇళ్లన్నీ నీలిరంగుతో మెరిసిపోతుంటాయి. ఈ నగరాన్ని ఒక్కసారిగా చూస్తే... ఆకాశం దుప్పటిలా కప్పేసిందా అన్నట్లుంటుంది. దీన్ని ఉమెద్ సింగ్ 19వ శతాబ్దంలో నిర్మించాడు. ఈ ప్యాలెస్‌ను కట్టడానికి 14 సంవత్సరాలు పట్టిందట. సుమారు 26 ఎకరాల విస్తీర్ణంలో 347 పడక గదులతో దీన్ని నిర్మించారు. దీని ఎత్తు 105 అడుగులు. ఏ సమయంలోనైనా సూర్యకాంతి లోపలికి ప్రసరించేందుకు వీలుగా దీనికి అద్దాలను ఏర్పాటు చేశారు. జోధ్‌పూర్‌లో కరువు పరిస్థితులు ఎదురైనప్పుడు, ప్రజలకు ఉపాధి కల్పించడానికి దీని నిర్మాణం చేపట్టారని చెపుతారు.

ప్రస్తుతం దీన్ని మూడు భాగాలుగా చేశారు. ఒక విభాగం రాజుగారి నివాసం. రెండో విభాగంలో మ్యూజియం ఏర్పాటు చేశారు. ఇందులో రాజు, రాణి ధరించిన వస్త్రాలు, ఆభరణాలు, రాజు వేసిన చిత్రాలు, రామాయణ చిత్రాలను ఇందులో చూడొచ్చు. మూడో భాగం హోటల్. రాజభరణాలు రద్దు కావడంతో రాజులు ఈ భవనాన్ని హోటల్‌కు లీజుకిచ్చారు. అది 1975లో జరిగింది. రాజులు, రాణులు కదలాడిన ప్రదేశంలో, కోటలో అడుగెట్టాక మనం కూడా ఎక్కడికో వెళ్లిపోయినా ఆశ్చర్యంలేదు.

ఒకక్షణం ఊహల్లోకి ... మరుక్షణం వాస్తవంలోకి వచ్చేస్తుంటాం. మన కాళ్లు మనకు తెలీకుండానే ముందుకు కదులుతుంటాయి. కళ్ల ద్వారా అక్కడి ప్రతి అణువును, వస్తువును మనసులో ముద్రించుకుంటుంటాం. రాజుల శౌర్యానికి, కళాతృష్ణకు సాక్ష్యంగా నిలిచిన కట్టడాలను, వస్తువులను మనసారా చూసి...వచ్చేస్తుంటే ఏదో తెలీని భావం మనసులో నెలకొంటుంది. తిరిగి మన లోకంలోకి వచ్చిన భావన కలుగుతుంది.

\- మైత్రి



సముద్ర జలాల్లో అదో సంచలనం. సముద్ర గర్భంలో నిశ్శబ్ద గమనం. ఉపరితల జలాలపై గంభీర సంచారి. అదే భారీ లోహ తిమింగలం.. జలాంతర్గామి (సబ్‌మెరైన్).

సముద్ర జలాల ద్వారా శత్రువు నుంచి పొంచి ఉన్న ముప్పును ఎదుర్కోడానికి మనిషి చేసిన అన్వేషణ ద్వారా రూపుదిద్దుకున్న ఆయుధం జలాంతర్గామి. దేశ ఆయుధ సంపత్తిలో దీనిదే ముఖ్య స్థానం. నిశ్శబ్దంగా శత్రువును మట్టుపెట్టే ప్రత్యేకతే వీటిపై దేశాల ఆసక్తికి కారణం. ఎవరికంటా పడకుండా సముద్ర గర్భంలో నిశ్శబ్దంగా సంచరిస్తూ శత్రువు ఉనికిని కనిపెట్టి మట్టుపెట్టడం, శత్రు స్థావరాల సమీపానికి వెళ్లి మందుపాతరలను జారవిడవడం జలాంతర్గామి చేసే పని. ఆధునిక యుద్ధ విన్యాసాల్లో అత్యంత ప్రముఖ స్థానం ఉన్న ఈ జలాంతర్గాములు ఎన్ని ఎక్కువ ఉంటే ఆ దేశం అంత శక్తివంతమైనదిగా భావిస్తారు.

అంతటి ప్రాముఖ్యత కలిగిన సబ్‌మెరైన్ల గురించిన పలు ఆసక్తికరమైన అంశాలతో కూడినదే ఈ వారం అట్టమీది కథ.

సముద్ర గర్భంలో... నిశ్శబ్ద గమనం...

- పి.యు.ఎస్. భాస్కరరావు

క్రీస్తు పూర్వం 332లోనే అలెగ్జాండర్ జలమార్గం ద్వారా ప్రత్యర్థులు దొంగ దెబ్బతీసే అవకాశం ఉందని గుర్తించి, సముద్ర గర్భం నుంచి పహారాకు ఆదేశాలు జారీచేసినట్టు, దీని కోసం ఓ ...ంట జాడీని (డైవింగ్ బెల్)ని రూపొందించినట్టు ప్రతీతి. ఇదే జలాంతర్గామి ఆలోచనకు పునాదిగా పేర్కొంటారు.

అయితే తొలి జలాంతర్గామి రూపొందింది 1620లో. ఇంగ్లండ్‌లో ఉంటున్న డచ్ వైద్యుడు కొర్నీలియస్ డ్రబ్బెల్ ఎక్కువ సమయం నీటి లోపల ప్రయాణించేందుకు వీలైన తొలి జలాంతర్గామిని సిద్ధంచేశాడు. కాల క్రమంలో అనేక మార్పులతో ఆధునిక జలాంతర్గాములు రూపొందాయి.

బలాస్ట్ ట్యాంకులు

జలాంతర్గామిలో కీలకం 'బలాస్ట్' ట్యాంకులు. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అమెరికాకి చెందిన రాబర్ట్ ఫల్టన్ జలాంతర్గామి లోపలి గోడ చుట్టూ మరో గోడ నిర్మించి, మధ్య ఖాళీలో నీరు నింపేలా బలాస్ట్ ట్యాంకులకు రూపకల్పన చేశాడు. ఆధునిక జలాంతర్గాముల్లోని బలాస్ట్ ట్యాంకులకు ఈ నమూనాయే అధారం. జలాంతర్గామి సముద్ర గర్భంలోకి వెళ్లాలనుకున్నప్పుడు బలాస్ట్ ట్యాంకుల్ని తెరిచి నీరు నింపుతారు. దీంతో జలాంతర్గామి బరువెక్కి సముద్రం కిందికి వెళ్తుంది. జలాంతర్గామి పైకి రావాలనుకున్నప్పుడు ఈ బలాస్ట్ ట్యాంకుల్లోకి అధిక ఒత్తిడితో గాలిని పంపి, నీటిని బయటకు పంపుతారు. దీంతో జలాంతర్గామి తేలికై ఉపరితలానికి వస్తుంది. సబ్‌మెరైన్ లోపలి గోడని ఇన్నర్ హల్ లేదా ప్రెషర్ హల్‌గా, బయటి గోడని ఔటర్ హల్‌గా పేర్కొంటారు. సముద్రంలోపల ఉన్నప్పుడు సిబ్బంది ఒత్తిడిని ప్రెషర్ హల్ కొంత వరకూ తగ్గిస్తుంది.

సబ్‌మెరైన్ ఎలా నడుస్తుంది?

జలాంతర్గాములు సముద్ర ఉపరితలంపై డీజిల్ ఇంజన్, సముద్ర గర్భంలో ఎలక్ట్రిక్ మోటార్ల ఆధారంతో నడుస్తాయి. సముద్ర గర్భంలో డీజిల్ ఇంజన్ పనిచేసేందుకు అవసరమైన 'గాలి' లభించదు కాబట్టి బ్యాటరీల ద్వారా ఎలక్ట్రిక్ మోటార్లను నడుపుతారు. జలాంతర్గాములు అత్యధికంగా 48 గంటలు మాత్రమే సముద్ర గర్భంలో ఉండే అవకాశముంది. ఆ తరువాత ఆక్సిజన్ కోసం రెండు రోజులకోసారి పైకి రావలసి ఉంటుంది. బ్యాటరీల సామర్థ్యాన్ని బట్టి ఛార్జింగ్



అరిహంత్ నిర్మాణమిలా...

కోసం కూడా ఒక్కోసారి పైకి రావలసి ఉంటుంది. అయితే జలాంతర్గామి పూర్తిగా సముద్ర ఉపరితలానికి రానవసరంలేదు. ఆక్సిజన్ కోసం, డీజిల్ ఇంజన్ రన్ చేయడం ద్వారా బ్యాటరీలను రీఛార్జ్ చేసుకోవడం కోసం సముద్ర ఉపరితలం నుంచి తొమ్మిది మీటర్ల దిగువ వరకూ వస్తాయి. అక్కడి నుంచి పైపులాంటిదాన్ని ఉపరితలానికి పంపి, గాలిని తీసుకుంటాయి. దీంతో ఆక్సిజన్ సమస్య తీరడంతోపాటు డీజిల్ ఇంజన్‌ని రన్ చేయడం ద్వారా బ్యాటరీలను కూడా ఛార్జ్ చేస్తారు. ప్రతి జలాంతర్గామి సముద్రంలో ఏకకాలంలో 60 రోజులు గడపడానికి సిద్ధమై వెళ్తుంది. అయితే యుద్ధ సమయాల్లో మాత్రమే ఏకకాలంలో 60రోజులపాటు సముద్రంలో ఉంటారు. మిగతా సమయాల్లో ఏకబిగిన నెల నుంచి నెలన్నర రోజులపాటు జలాంతర్గామి సముద్రంలో ఉంటుంది. డీజిల్ అవసరమైనప్పుడు జలాంతర్గామి బేస్‌కి రావలసి ఉంటుంది.

అణు జలాంతర్గామి

ఆధునిక అణు జలాంతర్గామికి ఇంధనం సమస్య ఉండదు. ఆధునిక అణు జలాంతర్గాములు 30 ఏళ్ళకు సరిపడ అణు ఇంధనాన్ని తీసుకెళ్లగలవు. సిబ్బందికి ఆహారం, సబ్‌మెరైన్ నిర్వహణ అవసరాలకే వీటిని పైకి తీసుకొస్తారు. అణు జలాంతర్గాములకు వేగంగా ప్రయాణించడం, ఎక్కువ లోతుకు వెళ్లగలిగే సామర్థ్యం ఉంటాయి. అమెరికా నిర్మించిన తొలి అణు జలాంతర్గామి యుఎస్‌ఎస్ నాటిలస్‌ని కేవలం ఎనిమిది పౌనుల యురేనియంతో 60వేల మైళ్లు ఏకధాటిగా ప్రయాణించింది.

అణు జలాంతర్గాముల్లో న్యూక్లియర్ రియాక్టర్ల ద్వారా సముద్ర జలాలను ఉపయోగించి నీటి ఆవిరిని ఉత్పత్తి చేసి దాని ద్వారా ప్రొపెల్లర్‌ని నడుపుతారు. జలాంతర్గాముల్లో అణు రియాక్టర్లను ఎయిర్ క్వాలిటీకీ, డిస్టిలింగ్ (సముద్రపు నీటి నుంచి తాగునీటిని తయారుచేసే ప్రక్రియ)కీ ఉపయోగిస్తున్నారు.

అణు జలాంతర్గామి 'అరిహంత్'

మనదేశ రక్షణ రంగ చరిత్రలో 2009 జూలై 26 చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. పూర్తి స్వదేశీ సాంకేతిక

ఆసియాలో తొలి జలాంతర్గామి మ్యూజియం

నౌకాదళం నుంచి ఉపసంహరించిన ఐఎన్ఎస్ కురుసురని మ్యూజియమ్‌గా మార్చారు. ఇది విశాఖ బీచ్ రోడ్డులో ఉంది. అనేక మంది సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్న దీన్ని సందర్శిస్తే జలాంతర్గామికి సంబంధించిన ప్రాథమిక విషయాలు తెలుసుకోవచ్చు.

2001 ఫిబ్రవరి 28న దీన్ని డీ కమిషన్ చేసిన తరువాత మ్యూజియమ్‌గా మార్చాలని ఆలోచన తూర్పు నౌకాదళం అప్పటి ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ వినోద్ పశ్రీచా మదిలో మెదిలింది. వెంటనే కార్యరంగంలోకి దిగి కేంద్రం నుంచి అనుమతి తెచ్చారు. దీంతో దీన్ని విశాఖ ఒడ్డున మ్యూజియంగా నెలకొల్పే పనులు ప్రారంభమయ్యాయి. 1945 టన్నుల బరువుండే ఈ జలాంతర్గామిని ఒడ్డుకు చేర్చడం చాలా కష్టమైంది. నేషనల్ షిప్ డిజైన్ అండ్ రిసెర్చ్ సెంటర్ (ఎన్ఎస్‌డిఆర్‌సి) సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించినా అనేక అవరోధాలు ఎదురయ్యాయి. దీంతో రెండు నెలల్లో ఒడ్డుకు చేర్చగలమనుకున్నది ఏడాదికిపైగా సమయంపట్టింది. దీన్ని ఒడ్డుకు లాగేందుకు ఉపయోగించిన లావైన ఇనుప తాళ్లు ఒకసారి తెగిపోయాయి. ఏడాదిపాటు దీన్ని ఒడ్డుకు లాగేందుకు నౌకాదళం, ఎన్ఎస్‌డిఆర్‌సి పడిన శ్రమకు విశాఖ ప్రజలు ప్రత్యక్ష సాక్షులు. మొత్తానికి అతి కష్టంమీద దీన్ని సాధించారు. సుమారు రూ.5.5 కోట్లు దీని కోసం ఖర్చైంది. 2002 ఆగస్టు 9న దీన్ని ప్రారంభించారు.

1969 డిసెంబర్ 18న ఒకప్పటి సోవియట్ రష్యాలోనే దీన్ని ప్రారంభించారు. 1971 భారత్-పాకిస్తాన్ యుద్ధంలో ఇది కీలకపాత్ర పోషించింది. 31 ఏళ్లపాటు నౌకాదళంలో సేవలందించింది. సోవియట్ యూనియన్ నుంచి కొనుగోలుచేసిన ఎనిమిది జలాంతర్గాముల్లో ఇది నాల్గోది. దీనికి ముందు కల్వరి, ఖందేరి, కరంజ్ భారత నౌకాదళంలో చేరగా దీని తరువాత వేలా, వగ్లి, వక్షీర్, వగీర్‌లు వచ్చాయి.

సందర్శకులకు అనువుగా ఉండేందుకు ఇందులో కొన్ని మార్పులు చేశారు. ఇందులో ఉండే ద్వారాలను పెద్దవి చేశారు. ఏసీలు పెట్టారు. దీని నిర్వహణ బాధ్యతలను రెండు కమిటీలు చూస్తున్నాయి. తూర్పు నౌకాదళ ప్రధానాధికారి ఛైర్మన్‌గా వుడా వైస్ ఛైర్మన్, కలెక్టర్, జీవీఎంసి కమిషనర్, పోలీస్ కమిషనర్, జాయింట్ కలెక్టర్‌లతో కూడిన అపెక్స్ కమిటీ.., వుడా వైస్ ఛైర్మన్ ఛైర్మన్‌గా వుడాకు చెందిన ఇద్దరు అధికారులు, నేవీకి చెందిన ఇద్దరు అధికారులతో మేనేజ్‌మెంట్ కమిటీ ఉన్నాయి.



భారత్ తొలి అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్

పుతిన్ సబ్‌మెరైన్ ప్రయాణం



రష్యా ప్రధాని పుతిన్ ఇటీవల చేసిన సబ్‌మెరైన్ డైవ్‌కి మీడియా విస్తృత ప్రచారం కల్పించింది. సైబీరియాలో ప్రపంచంలోనే అత్యంత లోతైన బైకాల్ సరస్సులో పుతిన్ ఈ విన్యాసం చేశారు. దీనికి ఆయన సబ్‌మెరైన్ 'మిర్ - 1'ని ఉపయోగించారు. ఇది మినీ సబ్‌మెరైన్. దీంట్లో ఆయన బైకాల్ సరస్సులో 14వందల మీటర్ల లోతుకు వెళ్లారు. ఈ విన్యాసం నాలుగు గంటలసేపు సాగింది. సముద్ర అడుగున ఆయన గడిపారు. దీనికి ప్రపంచ వ్యాప్త ప్రచారం లభించింది. ప్రఖ్యాత బైకాల్ సరస్సులో ఉన్న జీవజాలాన్ని సందర్శించేందుకే ఆయన ఈ విన్యాసంచేశారు. ఏపీజే అబ్దుల్ కలాం మన దేశాధ్యక్షుడిగా వున్నప్పుడు ఐఎన్ఎస్ సింధురక్షక్ జలాంతర్గామిలో ప్రయాణం చేశారు.

పరిజ్ఞానంతో నిర్మించిన అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్‌ని సముద్రంలో పరీక్షల (సీ ట్రయల్స్) కోసం విశాఖలో ప్రధాని మన్మోహన్‌సింగ్ సతీమణి గురుశరణ్ కౌర్ జలప్రవేశం గావించిన రోజిది. ఈ జలాంతర్గామి అన్ని పరీక్షలూ పూర్తిచేసుకుని నౌకాదళం అమ్ములపొదిలో చేరడానికి ఇంకో ఏడాది పట్టే అవకాశం ఉంది. ఏది ఏమైనా స్వయంగా అణు జలాంతర్గామిని నిర్మించుకుని మన సత్తాని ప్రపంచానికి వెల్లడించాం. ప్రపంచంలో అమెరికా, చైనా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్ వద్ద మాత్రమే అణు జలాంతర్గాములు ఉన్నాయి. ఐఎన్ఎస్ అరిహంత్ నిర్మాణంతో వీటి సరసన మన దేశం కూడా నిలబడింది. మన దేశ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెసెల్ (ఏటీవీ) ప్రోగ్రామ్ కింద దీన్ని నిర్మించారు. ఇందులో అమర్చిన అణు రియాక్టర్‌ని తమిళనాడులోని కల్పకంలో ఉన్న ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రిసెర్చ్ సెంటర్‌లో తయారుచేసేవారు. అరిహంత్ అంటే శత్రువుని సంహరించేది అని అర్థం. విశాఖ డాక్‌యార్డ్‌లో దీన్ని నిర్మించడం మరో విశేషం. అరిహంత్ బరువు 6వేల టన్నులు. ఇందులో ఏర్పాటుచేసిన న్యూక్లియర్ రియాక్టర్ ద్వారా 85 మెగావాట్ల విద్యుత్‌ని ఉత్పత్తి చేస్తారు. ఈ జలాంతర్గామి ఉపరితలంపై గంటకు 22 నుంచి 28 కిలోమీటర్లు (12 నుంచి 15 నాటికల్ మైళ్లు) వేగంతో, సముద్ర గర్భంలో గరిష్ఠంగా గంటకు 44 కిలోమీటర్లు (24 నాటికల్ మైళ్లు) వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉంది. ఇందులో 95 మంది సిబ్బంది ఉంటారు. 12 బాలిస్టిక్ మిస్సైళ్లు దీంట్లో ఉంటాయి.

ఐఎన్ఎస్ చక్ర

రక్షణ రంగంలో అందించిన సహకారంలో భాగంగా భారత్‌కి సోవియట్ యూనియన్ లీజుకిచ్చిన అణు జలాంతర్గామి పేరే ఐఎన్ఎస్ చక్ర. 1988 ఫిబ్రవరి 3న ఇది సోవియట్ యూనియన్ నుంచి విశాఖ తీరానికి చేరుకుంది. ఈ జలాంతర్గామిలో సోవియట్, భారత్ సిబ్బంది కలిసి పనిచేశారు. ఈ క్రమంలోనే భారత్ సిబ్బంది అణు జలాంతర్గామి నిర్వహణకు సంబంధించి నైపుణ్యాన్ని సోవియట్ సిబ్బంది నుంచి పొందారు. మూడేళ్ల లీజు పూర్తికాగానే ఇది తిరిగి సోవియట్‌కి చేరుకుంది.

తొలి అణు జలాంతర్గామి నాటిలస్

ప్రపంచంలో తొలి అణు జలాంతర్గామిని అమెరికా నిర్మించింది. 1955లో 55 మిలియన్ డాలర్ల వ్యయంతో అమెరికా నిర్మించిన యుఎస్ఎస్ నాటిలస్ ప్రపంచంలోని తొలి అణు జలాంతర్గామి. దీన్ని 2002 మే 8న అమెరికా ఉపసంహరించింది.

సోవియట్ యూనియన్ 1958లో తొలి అణు జలాంతర్గామిని నిర్మించింది. 1997 వరకూ సోవియట్ యూనియన్ మొత్తం 245 అణు జలాంత ర్గాములను తయారుచేసింది. ప్రపంచంలో అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్‌ల వద్ద మాత్రమే అణు జలాంతర్గాములున్నాయి. అత్యధికంగా అమెరికా, రష్యా, చైనాల వద్ద అణు జలాంతర్గాములు ఉన్నాయి. అర్జెంటైనా, బ్రెజిల్ కూడా అణు జలాంతర్గాముల నిర్మాణంపై దృష్టిపెట్టాయి.

వాగ్లి ఉపసంహరణ

భారత నౌకాదళం ఇటీవల కాలంలో ఉపసంహరించిన జలాంతర్గామి ఐఎన్ఎస్ వాగ్లి. విశాఖలోని నేవల్ డాక్‌యార్డ్‌లో డిసెంబర్ 9న దీన్ని డీ కమిషన్ చేశారు. 1974 ఆగస్టు 10న ఒకప్పటి సోవియట్ యూనియన్‌లోని రీగాలో దీన్ని కమిషన్ చేశారు. దీన్ని కమిషన్ చేసిన అప్పటి లెఫ్టినెంట్ కమాండర్ లలిత్ తల్వార్ దీని డీ కమిషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావడం విశేషం. 36 ఏళ్లపాటు సుదీర్ఘకాలం సేవలందించిన వాగ్లికి 23 మంది కమాండింగ్ ఆఫీసర్లుగా వ్యవహరించారు. విశాఖలో కురుసుర సబ్‌మెరైన్ తరహాలో వాగ్లిని చెన్నయ్ లేదా కొచ్చిన్‌లో మ్యూజియంగా మార్చే అవకాశముంది.



ఇటీవల సర్వీసు నుంచి ఉపసంహరించిన ఐఎన్ఎస్ వాగ్లి జలాంతర్గామి.



1960లో డచ్ వైద్యుడు కొర్నీలియస్ రూపొందించిన జలాంతర్గామి ఊహాచిత్రం

సాహసోపేతం

జలాంతర్గామిలో విధి నిర్వహణ సాహసోపేతమైనది. జలాంతర్గామిలో ఉన్నప్పుడు కళ్లకు ప్రత్యక్షంగా ఏమీ కనిపించదు. యుద్ధ నౌకకీ, జలాంతర్గామికీ ఉన్న తేడా ఇదే. ఎప్పుడు ఏం జరుగుతుందో కూడా తెలియదు. ఒక రకంగా జలాంతర్గామిలో విధి నిర్వహణ పూర్తి రిస్క్. సముద్ర గర్భంలో ప్రయాణం. చుట్టూ నీరు. కంపాస్ ద్వారా గమనం సాగుతుంది. జలాంతర్గామి లోతుకు వెళ్తున్నకొద్దీ సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. జలాంతర్గామిలో స్నానం ఉండదు. డిస్పోజబుల్ డ్రెస్ అందుబాటులో ఉంటుంది. బేస్‌కి వచ్చిన తరువాత డిస్పోజబుల్ డ్రెస్‌లను సముద్రంలో విసిరేస్తాం. జలాంతర్గామిలో ఏడు కంపార్ట్‌మెంట్లు ఉంటాయి. ఒక దాంట్లోంచి మరోదాంట్లోకి వెళ్లాలంటే చిన్నగా ఉండే ద్వారాల్లోంచి ఒంగి వెళ్లాలి. పడుకోవడానికి అంత సౌకర్యంగా ఉండదు. ఒకటో కంపార్ట్‌మెంట్‌లో టార్పెడోల మధ్య ఉండే కాస్త స్థలంలో పడుకోవలసి ఉంటుంది. మిగతా కంపార్ట్‌మెంట్లలో ఒకదానిపై ఒకటి బెడ్లు ఉంటాయి. కింద బెడ్‌పై ఒకరు పై బెడ్‌పై ఒకరు పడుకుంటాం.

–జి ఫణిరాజు,
ఐఎన్ఎస్ కురుసుర క్యూరేటర్.

ఎంతో ధైర్యముండాలి

జలాంతర్గామిలో పనిచేయాలంటే ధైర్యం ఉండాలి. నేవీలో పనిచేస్తున్నప్పుడు జలాంతర్గామిలో పనిచేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చాను. సబ్‌మెరైనర్‌గా విధి నిర్వహణ ఎంతో సంతృప్తినిచ్చింది. ఆరు నెలల పాటు క్లాస్‌రూమ్ శిక్షణ ఉంటుంది. ఆ తరువాత సబ్‌మెరైన్‌లోకి పంపి ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారు. జలాంతర్గామిలో మామూలుగానే గాలి పీలుస్తాం. కార్బన్ డై ఆక్సైడ్ అనలైజర్ ఉంటుంది. దీని శాతం పెరుగుతున్నప్పుడు ఎయిర్ ప్యూరిఫికేషన్ జరుగుతుంది. ఇలా కొన్నిసార్లు జరిగిన తరువాత ఇక ప్యూరిఫికేషన్ సాధ్యం కాదనుకున్నప్పుడు ఉపరితలానికి వెళ్తాం. సబ్‌మెరైన్‌లో మూడు షిఫ్ట్‌లు ఉంటాయి. రోజుకు ఎనిమిది గంటల పని ఉంటుంది. కొంతమందిని నాలుగు గంటలకోసారి రిలీవ్ చేస్తారు. షిఫ్ట్‌లన్నీ జలాంతర్గామి బయలుదేరడానికి ముందే నిర్ణయమైపోతాయి. దీనికి కెప్టెన్ అనుమతి కూడా ఉంటుంది. 75 మంది వరకూ సిబ్బంది ఉంటారు.

–ఇంద్రగంటి రాము,
రిటైర్డ్ పెట్టీ ఆఫీసర్, ఐఎన్ఎస్ కరంజ్.

రాత్రీపగలూ తేడా తెలియదు

రాత్రి, పగలు తేడా తెలియదు. జలాంతర్గామిలో విధి నిర్వహణ సాహసంతో కూడుకున్నది. ఐఎన్ఎస్ సింధుఘోష్, ఐఎన్ఎస్ కురుసురలో పనిచేశాను. కురుసుర సముద్రంలో ఉన్నప్పుడు దాంట్లో పనిచేశాను. దాన్ని ఉపసంహరించి, మ్యూజియమ్‌గా మార్చిన తరువాత దాంట్లో పనిచేస్తున్నాను. ఇది ఒక రకంగా గర్వంగా ఉంది. కమ్యునికేషన్ అంతా టెలిగ్రాఫ్ సిస్టమ్‌లో జరుగుతుంది. ఆధునిక జలాంతర్గాముల్లో ఇప్పుడు శాటిలైట్‌ని ఉపయోగించి కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధిచేశారు. గతంలో టెలిగ్రాఫ్ సమాచార వ్యవస్థే ఆధారం. మామూలు ఆహారాన్నే తీసుకుంటాం. బ్యాటరీల ద్వారా విద్యుత్ తీసుకుని ఎలక్ట్రిక్ స్టౌల ద్వారా వంట చేస్తారు. ఉదయంపూట బ్రేక్‌ఫాస్ట్‌లో ఎక్కువగా బ్రెడ్, జ్యూస్ ఉంటుంది. శత్రు జలాంతర్గాములు, నౌకల్ని కనుక్కోవడం సోనార్ పరికరం ద్వారా జరుగుతుంది. సోనార్ ద్వారా శబ్ద తరంగాలను పంపి శత్రువుని గుర్తిస్తాం. దీని ఆధారంగానే టార్పెడోల ప్రయోగం జరుగుతుంది.

–కెవి చలపతిరావు,
రిటైర్డ్ చీఫ్ టెల్, ఐఎన్ఎస్ సింధుఘోష్.



ఐఎన్ఎస్ శాతవాహన

దేశంలో ఏకైక జలాంతర్గామి శిక్షణా కేంద్రం ఐఎన్ఎస్ శాతవాహన. ఇది ఉన్నది ఎక్కడో కాదు. మన రాష్ట్రంలోని విశాఖలోనే. సోవియట్ యూనియన్ నుంచి జలాంతర్గాముల్ని సమకూర్చుకుంటున్న క్రమంలో వాటిలో పనిచేయడం కోసం సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో ఐఎన్ఎస్ వీరబాహులో సబ్‌మెరైనర్ శిక్షణ ప్రారంభమైంది. ఆ తరువాత కేంద్రం అనుమతితో విశాఖపట్నంలో ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. దీన్ని 1974 మార్చి 11న ప్రారంభించారు. అదే ఏడాది డిసెంబర్ 21న ఐఎన్ఎస్ శాతవాహనగా పేరుపెట్టారు. ప్రారంభంలో దీంట్లో యుద్ధ నౌకలు, జలాంతర్గామికి సంబంధించిన శిక్షణ ఇచ్చేవారు. 1986లో దీన్ని పూర్తిగా జలాంతర్గామి శిక్షణ కేంద్రంగా మార్చారు. శాతవాహన రాజుల కాలంలో సముద్ర యానం పెద్ద ఎత్తున అభివృద్ధిచెందింది. వారి కాలంలో భారత నావికులు సుదూరంలోని జావా, సుమత్రల వరకూ వెళ్లినట్టు గుర్తించారు. అలాగ రోమన్ చక్రవర్తులతో శాతవాహనులు వ్యాపార సంబంధాలు ఏర్పరచుకున్నారు. దీనికి గుర్తుగా జలాంతర్గామి శిక్షణ కేంద్రానికి ఐఎన్ఎస్ శాతవాహనగా నామకరణం చేశారు.

జలాంతర్గామి దినోత్సవం

1978 డిసెంబర్ 8 వ తేదీన భారత నౌకాదళం ఐఎన్ఎస్ కల్వరి జలాంతర్గామిని కమిషన్ చేసింది. ఇదే మన దేశ మొదటి జలాంతర్గామి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 8న ఏటా జలాంతర్గామి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఐఎన్ఎస్ కల్వరిని ఒకప్పటి సోవియట్ రష్యా నుంచి భారత్ కొనుగోలుచేసింది. దీన్ని కమిషన్ చేసింది కూడా సోవియట్ రష్యాలోని రిగాలోనే. ఈ జలాంతర్గామి 'ఫిన్' విశాఖ బీచ్‌లో ఉంది. 1996 మే 31న దీన్ని నౌకాదళం నుంచి ఉపసంహరించారు. ★

కథ

రిక్షాతాత

- రావుల పుల్లాచారి

సంధ్య వాలింది. రాత్రి 8 గంటలవుతోంది. దమయంతి వంటపనులు ముగించుకొని, పిల్లలు చదువుకొంటున్న స్టడీ రూంలోకి వచ్చింది. చైతన్య.. దీప్తి ఏం చదువుతున్నారోనని పరీక్షగా చూడసాగింది.

తల్లిని చూసిన చైతన్య గోముగా 'అమ్మా మరే..మరే.. మేం వెళ్తున్న రిక్షా పంక్చర్ అయింది.. రిక్షా తాత.. దిగి.. మెల్లిమెల్లిగా నెట్టుకుంటూ వెళ్ళేసరికి మా స్కూలుగేటు మూసివేశారు. ప్రేయర్ అయ్యేంత వరకు మమ్మల్ని ఎలో చేయలేదమ్మా..' చైతన్య చెపుతూ పోతుంటే. "అవునమ్మా! రేపటి నుండి మేము ఆ డొక్కు రిక్షాలో స్కూలుకు వెళ్లం. మా స్నేహితులందరు.. తమ్ముణ్ని, నన్ను గేలిచేస్తున్నారు తెలుసా!' దీప్తి ఫిర్యాదు చేస్తూ రాగాలు పోతోంది.

సరిగ్గా అపుడే ఆఫీసు నుండి వచ్చిన భాస్కర్ "ఏంటి.. దమయంతి! పిల్లలు ఏదో నసుగుతున్నారు?' అడిగాడు.

"ఆ తాత రిక్షాలో ఇక నుండి స్కూలుకు వెళ్లరట.. అందులో వెళ్ళడం మన పిల్లలు.. అవమానంగా భావిస్తున్నారు" చిన్నగా నవ్వుతూ దమయంతి చెపుతుంది.

"అవును డాడీ.. ఆ రిక్షా టాపు అంతా చిరిగి పోయింది... తాతకు రిక్షా లాగడం కూడా చేతకావడం లేదు తెల్సా!' అంటూ పిల్లలిద్దరు ఆరిందల్లా కళ్ళ తిప్పుతూ.. చేతులు ఊపుతూ ఏకకంఠంతో పలికారు.

'వేలెడు లేరు విన్నారా వీళ్ల మాటలు.. ఆ రిక్షాతాత అయితే వీళ్లను జాగ్రత్తగా తీసుకు వెళతాడు. కాస్త ఆలస్యం అయినా హడావుడి పెట్టకుండా కూర్చుంటాడు.. సరే రేపు ఆలోచిద్దాం గాని ముందు భోజనాలకు రండి" అంటూ అన్నం వడ్డించడానికి వెళ్లింది

◆◆◆

బయట గణ గణ మంటూ గంట కొడుతున్నాడు రిక్షాతాత. ఎవరూ బయటకు రాకపోయేసరికి తానే మెల్లిగా లోపలకు వచ్చాడు.

"ఎంటమ్మగోరు.. పిల్లలు ఈ రోజు స్కూల్‌కు వెళ్లరా ఏంటి?"

"వస్తున్నారు తాతా" అంటునే.."చైతన్య... దీప్తి.. పదండి.. క్విక్... రిక్షా వచ్చింది... టైం అవుతోంది. స్కూల్‌కు వెళ్లండి..." అంది. పిల్లలు అప్పటికీ కదలకుండ నిలబడి పోయేసరికి.... దమయంతి స్వరం తగ్గించి పిల్లలిద్దర్ని బుజ్జగిస్తూ...

"దీప్తీ... వచ్చే నెల నుండి కొత్త రిక్షా మాట్లాడతాను.. ఈసారికి వెళ్లండి" అంది.

ఇది విన్న తాత చలించిపోతూ 'అదేంటి అమ్మగోరు ...కొత్త రిక్షా మాట్లాడుతున్నారా ఎంటి?" అడిగాడు ఆందోళనగా.

"అదేం లేదులే తాతా! మీరు వెళ్లండి" అంటు పిల్లల్ని తీసుకొచ్చి రిక్షాలో కూర్చోబెట్టింది.

"రేపటి నుండి మేం కొత్త రిక్షాలో వెళతాం!! ఇక నీ రిక్షాలో రాం పో!" అంటూ పిల్లలు పరుగెత్తుకొంటూ వెళ్లి పాతరిక్షాలో ఎక్కి కూర్చున్నారు.

పాప బ్యాగు భుజాన, బాబు బ్యాగు చంకలో పెట్టుకొని, తాత భారంగా రిక్షాను ముందుకు లాగిస్తున్నాడు. వెళుతున్న రిక్షాను తదేకంగా చూస్తున్న దమయంతిని "ఏంటి దమయంతి ఆలోచిస్తున్నావు.." అడిగాడు భాస్కర్.

"ఏం లేదండి! ఆ రిక్షాతాతను అర్ధాంతరంగా మానుకోమంటే.. ఎంత బాధ పడిపోతాడోనని ఆలోచిస్తున్నాను.

"మన పిల్లలు ఆ పాత రిక్షాలో ససేమిరా, వెళ్లమంటున్నారు మరేం చేస్తాం చెప్పు...." బైక్ తుడవడం పూర్తిచేసిన భాస్కర్ "సరే! ఆ విషయం తర్వాత ఆలోచిద్దాం! నువ్వు ఆఫీసుకు వెళ్లడానికి రెడీ అవ్వవా!" అంటూ హడావుడిగా బట్టలు వేసుకొని బైక్ మీద వెళ్లిపోయాడు.

మరుసటి రోజు ఉదయమే తాత రిక్షాతో పాటు వచ్చి ఇంటి ముందు కూర్చొని తలకు చుట్టుకున్న తుండుగుడ్డ దులుపుకొంటూ కనిపించాడు దమయంతికి. ఆమెను చూచి "అమ్మగోరు.. పిల్లలు నా పాత రిక్షాలో రావడానికి ఇష్టపడడం లేదా అమ్మా!" మనసును తొలుస్తున్న సందేహాన్ని అడిగాడు.

"వాళ్లకేం తెలుసు తాతా! పిల్లలు కొత్త వస్తువుల మీద, వాహనాల మీద ఎక్కువ మోజు చూపుతుంటారు సహజంగా! అది నువ్వు మనసులో పెట్టుకొని బాధపడకు!' దమయంతి తాతను ఓదార్చే ప్రయత్నం చేసింది.

"రిక్షానంటే కొత్తగా చేయవచ్చు కాని.., కాని.. కుంగిపోయి, బతుకులో చితికి పోయిన నేను కొత్తగ ఎలా అవుతాను అమ్మగోరు"

"నువ్వు లోపలకు రా తాత... ఈ రోజు పిల్లలు వాళ్ల నాన్నగారితో బైక్ మీద వెళ్లారు" అంటూ దమయంతి లోపలకు నడిచింది.

"అదేంటమ్మగోరు! నేను అప్పటి నుండి వాళ్లకోసమేగా కాచుకు కూర్చున్నాను.

"తాతా! ముందు నువ్వు అలా కూర్చో. నేను నీతో ఒక విషయం చెప్పాలి".

"నాకు! తెలుసు అమ్మగోరు. పిల్లలు నా పాత రిక్షాలో రావడానికి ఇష్టపడడం లేదు, మరో కొత్త రిక్షా మాట్లాడుకొంటాం...ఇక.. ఈ రోజు నుండి నువ్వు మానుకో అంటారు. అంతే కదమ్మగోరు.." సూటిగా దమయంతి మొహంలోకి చూస్తూ అడిగాడు.

"తాతా! మాకు నీ రిక్షా అంటేనే ఇష్టం. కాని పిల్లలు.. దమయంతి మనసులో బాధ మెలిపెడుతుంటే మాటలు పూర్తి చేయలేక పోయింది.

"ఫర్వాలేదమ్మా.. మీరేం.. బాధపడకండి.. నన్ను చూసో... లేక నా రిక్షా చూసో... గానీ ఎవ్వరూ రిక్షా ఎక్కడం లేదమ్మా... ఇక రిక్షాతొక్కడానికి నేను పనికి రానమ్మా. అయిపోయింది. ఆ భగవంతుడు తొందరగ నన్ను పైకి తీసుకెళితే బాగుండు"

"ఛ! అవేం మాటలు తాతా! నీ రిక్షాలోనే పంపిస్తాను. నువ్వు బాధపడకు" అంటు తాత భుజం మీద ఆప్యాయంగా చేతులు వేస్తూ... "తాతా! నీకు నా అన్నవాళ్లు ఎవరూ లేరా! ఇంత పట్నంలో ఈ వృద్ధాప్యంలో రిక్షా లాగడం నీవల్ల కాదు తాతా!"

"నాకు ఓ కొడుకు ఉన్నాడు తల్లీ! వాడికి పెళ్లి కూడా చేశాను. బొగ్గుబాయిలో పని చేస్తున్నాడు"

"మరి ఇంకేం..." అంటు తాత మొహంలోకి చూసింది దమయంతి.

తాత... తన కథ చెపుతూనే ఉన్నాడు. "వాడికి ముగ్గురు సంతానం.. వాడి జీతమంతా వాడి తాగుడుకే సరిపోతుంది. వద్దని నేను, నా కోడలు ఎంత వాదించినా వాడు వినడు.. మేం వాడి తాగుడుకు అడ్డుపడుతున్నామంటూ మా ఇద్దర్నీ ఎన్నోసార్లు కొట్టాడు... పిల్లలున్నారు కాబట్టి నా కోడలు వాడితోనే ఉంటుంది. .. నా కోడలు నన్ను తండ్రిలాగానే చూసుకొంటుంది. కాని కొడుకు చేత దెబ్బలు తినలేక.. నేనే వాళ్లకి దూరంగా ఒంటరిగా బతకడానికి వచ్చానమ్మా...."

"నీ ఒంటరితనంలో ఇంత విషాదం దాగున్న మాట" తనలో తాను అనుకుని "తాతా! మా పిల్లలు నీ రిక్షాలో రాకున్నా ఫర్వాలేదు.. నన్ను రోజూ నీ రిక్షాలో ఆఫీసుకు తీసుకువెళ్లు.. మరో వంద రూపాయలు ఎక్కువగా ఇస్తాను" తాతకు భరోసా ఇచ్చింది.

కృతజ్ఞతాపూర్వకంగా చేతులు జోడించి "నా గోడు విని దయతలచారు. అంతే చాలు.. నాకు ఎక్కువ డబ్బులు అవసరం లేదమ్మా. నిన్ను నా ప్రాణం కన్న మిన్నగా రోజు ఆఫీసులో దిగబెడతాను. రండమ్మగోరు.. మీకు ఇప్పటికే ఆలస్యం అయింది..." అన్నాడు సంతోషంగా తాత.

దమయంతి ఒక అరగంటలో తయారయి ఇంటికి తాళం వేసి వచ్చి... "పద తాత" అంటూ రిక్షాలో కూర్చుంది.. తాత ఉత్సాహంగా రిక్షా ఎక్కి పెడల్‌పై కాలువేశాడు.. మరో అరగంటలో రిక్షా దమయంతి ఆఫీసు ముందు ఆగింది.

"తాతా మళ్లీ సాయంత్రం 5 గంటలకు రిక్షాను తీసుకొని ఆ చెట్టు కింద కూర్చో.. వస్తాను" అంటు రిక్షా దిగి బ్యాగ్ సవరించుకొంటు ఆఫీసు లోపలకు వెళుతుంటే..

ఆఫీసు అటెండర్ 'ఏంటమ్మగోరు! ఈ వేళ సిమెంట్ బస్తాలు మోసే రిక్షాలో వచ్చారు. ఆ ముసలాడు రిక్షా ఎం లాగుతాడు.. మిమ్మల్ని ఎక్కడైనా పడేయగలడు.." అంటుంటే మరొక అటెండర్ అందుకొని "ఎప్పుడూ ఆలస్యంగా ఆఫీసుకురాని అమ్మగారు. ఆ డొక్కు రిక్షాలో రావడంవల్లనే లేట్ అయినట్టున్నారు" అన్నాడు. వాళ్ల మాటలు ఏమీ పట్టించుకోని దమయంతి తన సీట్లో కూర్చొని ఫైళ్లు తిరగేస్తోంది.

తన పక్క కేబిన్‌లోని గోవిందు.. "ముసలాడైతే చీప్ రేట్‌కు వస్తాడనుకుని ఆ రిక్షా మాట్లాడుకున్నట్టు ఉంది మేడమ్" పెద్ద జోక్ వేసినట్టు ఫోజు పెట్టాడు.

"మిష్టర్ గోవింద్! ఇతరుల విషయాల్లో తల దూర్చకూడదని మీకు ఎన్ని మార్లు చెప్పాను.. మీ పని మీరు చేసుకోండి.." అని సీరియస్‌గా గోవిందువైపు చూసింది.

"అవునవును! అంతేలెండి! అటెండర్లు అంటుంటే విని అన్నాను. నాకెందుకు మేడమ్" అంటూ ఫైల్లో తల దూర్చాడు. వారం రోజులుగా తాత రిక్షాలోనే దమయంతి ఆఫీసుకు వెళ్లి వస్తుంది. తాను రిక్షాలో కూర్చున్నపుడు, రిక్షా బలవంతాన లాగుతున్న పెద్దాయన కష్టాన్ని చూస్తూ దమయంతి తట్టుకోలేక పోతుంది. పోనీ వద్దు అందామంటే...

తాత, స్వాభిమానంతో 'నా జీవనాధారం ఈ రిక్షా ఒక్కటే అమ్మా. ఇది కూడా మాని నన్ను ఏం చేయమంటారు?' అంటాడు. దయతో ఇచ్చే డబ్బులు అస్సలు వద్దంటాడు.. తాతను ఆదుకోవడానికి తాను అందులో వెళ్లడమొక్కటే ఆయనకు చేసే సహాయం అనుకుంది నిస్సహాయంగ..

◆◆◆

బయట రిక్షా ఆగిన చప్పుడు విని 'రెడీ అయ్యాను. వచ్చేస్తున్నాను..."

" ఫర్వాలేదు. రండి అమ్మగారు" అంటు తాత లోపలకు వచ్చాడు.

ఈ రోజు ఏదో అడగాలన్న.. తపన.. తటాపటాయిస్తున్న అతని మొహంలో స్పష్టంగా గమనించిన దమయంతి

"ఏం తాత! ఏదైనా అడగాలనుకుంటున్నావా"

"లేదమ్మగారు! రాత్రి నుండి నా పిల్లలందరు గుర్తుకొస్తున్నారు. ఒకసారెళ్ళి చూసి వద్దామనుకొంటున్నాను..."అంటూ ఆగిన తాత ఉద్దేశ్యం గ్రహించిన దమయంతి

"డబ్బులు కావాలా? అడుగుతాతా! ఇక నుండి నీకు ఏ అవసరం వచ్చినా నిర్భయంగా అడుగు! సహాయం చేయడానికి, నీకు నేనున్నానన్న సంగతి మర్చిపోకు.." సహాయం చేయడానికి వచ్చిన అవకాశానికి ఆనందిస్తు.. "ఎంతకావాలో చెప్పు" అంది.

"ఎంతా! అంటే.. ఒక ఐదువందలు ఇవ్వండమ్మా! నేను మా ఊరినుండి తిరిగి రాగానే మీ డబ్బులు మీకు పువ్వుల్లో పెట్టి ఇస్తాను"

'సరే! అది నీ ఇష్టం!" అంటు పర్స్‌లో నుండి 500/-రూ. నోటు తీసి తాతకు అందించింది.

ఎంతో ఉద్విగ్నంగా ఆ నోటు అందుకొని బనిన్ లోపలి జేబులో బధ్రపరుచుకుంటూ "పదండి అమ్మగారు.. మిమ్మల్ని ఆఫీసు వద్ద దిగబెట్టి.. అటుగా నేను గవర్నమెంటు ఆస్పత్రికెళ్తాను. రాత్రి నుండి గుండెలో ఒకటే నొప్పిగా ఉంది. డాక్టర్‌గారికి చూపించుకొని... మందులు రాయించుకొని సాయంత్రం బండికి మా ఊరు వెళ్తాను..."

"అరె! గుండె నొప్పిగా ఉందా? ఈ రోజు నేను బస్సులో వెళతాను.. ముందు నువ్వు డాక్టర్ వద్దకు వెళ్లిచూపించుకో.." దమయంతి బతిమాలుతున్నట్టు చెప్పింది.

"నువ్వు గాబరా పడకు తల్లీ! నా బతుకులో ఎన్నో బాధల్నీ, కష్టాల్నీ అనుభవించి తట్టుకొన్న ఈ గుండె చాలా గట్టిదమ్మా. అది అంత తొందరగా ఆగిపోదు.. బతుకు పోరులో ఓడిపోదు..ముందు రిక్షా ఎక్కండి" అంటూ.. దమయంతిని మారుమాట్లాడనివ్వకుండా ఎక్కించుకొని ఆఫీసు ముందు దిగబెట్టాడు.

◆◆◆

ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు... ఆఫీసు అటెండర్ పరుగు పరుగున దమయంతి దగ్గరకు పరుగెత్తుకొంటు వచ్చి

'మేడమ్.. మిమ్మల్ని రోజూ ఆఫీసుకు రిక్షాలో తీసుకు వస్తాడే ముసలాడు.. ఆ సెంటర్‌లోని చెట్టు కింద చచ్చిపడున్నాడు మేడమ్. అక్కడ అందరూ గుమిగూడారు.. శవాన్ని ఎవరూ గుర్తుపట్ట లేదు... మీతో చెబుతామని పరుగెత్తుకొచ్చాను ..."

"ఆ! రిక్షాతాత.. చచ్చిపోయాడా! పద వెళ్దాం" అంటూ అటెండర్‌ని తీసుకొని దమయంతి వడివడిగా నడవసాగింది. అప్పటికే పోలీస్ వాళ్లు చేరుకుని పంచనామా చేస్తుంటే పక్కనే నిలబడ్డ మరో పెద్దమనిషి పోలీసులకు ఏదో చెబుతున్నాడు.

"అవునండి వాడికి ఎవరూ లేరండి.. ఏ ఊరు నుండి వచ్చాడో కూడా నాకు తెలియదు. నా కాడికి వచ్చి ఓ పాతరిక్షా ఉంటే ఇవ్వండని బతిమిలాడితే.. ఏదో ముసలాడు కదా అని... ఆ డొక్కు రిక్షాను రోజు 20 రూపాయల చొప్పున బాడుగకు ఇచ్చానండి. పాపం.. ముసలాడు మంచోడండి.. శవం మీద అబద్ధం చెప్పేవాణ్ని కాదండి.. వాడి బనీన్ జేబులో బయటపడ్డ ఆ ఐదువందలు రిక్షా అద్దె కింద నాకు ఇప్పిస్తే నేను వెళ్లి పోతానండి"

"సరే నువ్వు పోలీస్ స్టేషన్ వరకు వచ్చి మా సి.ఐగారితో మాట్లాడి ఈ అనాథ శవాన్ని గుర్తుపట్టినట్టు ఒక సంతకం పెట్టు" అంటూ ఎస్ఐ ఆపెద్ద మనిషి వైపు తీక్షణంగా చూశాడు.

"బాబ్బాబు.. మీకు దండం పెడతాను.. ఆ ముసలాడు ఎవరో నాకు అస్సలు తెలియదండి.. సంతకం పెట్టి స్టేషన్ చుట్టూ తిరగలేను. నన్ను వదిలేయండి.. నేను వెళతాను.." అంటు మెల్లిగా గుంపులో కలిసిపోయాడు. అక్కడ ఉన్న మందిని తోసుకొంటు శవం ముందుకు వచ్చిన దమయంతి నిశ్చేష్టురాలైంది. తాత భుజం మీద ఉన్న తెల్ల కండువా తీసి మొహం మీద కప్పాడు పోలీసు..

"ఈ తాత! అనాథ శవం కాదు. అతనికి నేనున్నాను" అంటు ఎస్ఐ అందించిన ఎఫ్.ఐ.ఆర్. మీద సంతకం పెట్టిన దమయంతిని అక్కడ గుమిగూడిన వాళ్లందరూ ఆశ్చర్యంగా చూశారు. కొందరు అభినందించారు. తర్వాత ఒక్కరొక్కరే అక్కడి నుండి వెళ్లిపోయారు.

సంధ్య వాలింది - రాత్రి ఎనిమిది గంటలవుతుంటే...కూసింత బాధగా.. ఇల్లు చేరింది దమయంతి.

★

వికాసం

పలకరిస్తే... పరమానందమే!

చాలా రోజుల తర్వాత వేణు వాళ్ల ఇంటికి వెళ్లాడు రమేష్. ఇంట్లో ఎవరూ లేరేమో కొద్దిసేపటి వరకూ తలుపు తీయలేదు. ఆ తర్వాత తలుపు తీస్తున్న సవ్వడి అయినా బాగా ఆలస్యమైంది. ఒకింత విసుగు అనిపించిందిగాని తీరా చూస్తే తలుపు తీసింది వాళ్ల నానమ్మ. పెద్దావిడ గనక ఆలస్యమైందని అర్ధమైపోయింది.

'మామ్మగారూ! వేణు లేడా?' అడిగాడు.

'లేడు బాబూ, ఇప్పుడే ఏదో తీసుకు వస్తానని వెళ్లాడు. వచ్చేస్తాడు.' ఆమె జవాబు చెప్పింది. అయితే ఆ చెప్పడంలో ఏదో తప్పు చేస్తున్నట్టు, లేక చేస్తానన్నట్టు కనిపించని జంకు దాచేసినా దాగకుండా ధ్వనిస్తున్నది.

'మీరెప్పుడు వచ్చారు మామ్మగారూ, ఒక్కరే వున్నారా? వంట్లో బావుందా' అని అడిగాడు వేణు. నిజానికి ఆమె గురించి అతనికి పెద్దగా తెలియదు.

'ఇంట్లోనే పడుంటాను గాని ఎక్కడికి వెళ్తాను.. చూపు కనిపించదయ్యా.. దానికి తోడు మోకాళ్ల నొప్పి ఒకటి.. ఏం చేస్తాను..' అంటూ ఆమె అదో ధోరణిలో చెప్పుకొచ్చింది.

రమేష్, వేణు తరచూ కలుస్తుంటారు. గంటల తరబడి మాట్లాడుతుంటారు కూడా. ఈ మామ్మ గురించి ఎప్పుడూ వారి మధ్య ప్రస్తావనే రాలేదు. ఇలా ఆలోచిస్తున్నంతలోనే వేణు వాళ్లమ్మగారు లోపలినుంచి వచ్చారు.

'సర్లేమ్మా.. అప్పుడే చెప్పడం మొదలు పెట్టావు, ఎప్పుడూ నీ కళ్లు కనపించవని నీ మోకాళ్లు పని చేయవని ఇదే ధ్యాసా? ఆ అబ్బాయి ఏదైనా పని మీద వచ్చుంటాడు..' అని విసుక్కుంది.

'అబ్బే ఆవిడేమి అనలేదండీ.. నేనే మాట్లాడించాను...సరేనమ్మా... వేణు వస్తే చెప్పండి' అని బయిటకు నడిచాడు. అయితే ఇదంతా రమేష్‌కు పెద్ద వింతగా అనిపించలేదు. ఎందుకంటే వాళ్లింట్లో పరిస్థితి కూడా ఇంతకంటే భిన్నంగా వుండదు. తన మామ్మ పట్ల తామూ ఇలాగే ప్రవర్తిస్తుంటాం.

◆◆◆

వేణు, రమేష్ ఇళ్లలోనే కాదు. నూటికి ఎనభై ఇళ్లలో ఇదే పరిస్థితి ప్రత్యక్షమవుతుంటుంది. డెబ్బై ఎనభై దాటిన వాళ్లు అమ్మలు నాన్నలు కావచ్చు. తాతలు మామ్మలు కావచ్చు. ఎవరైనా సరే మాటలకు మొహం వాచి వుంటారు. వాళ్లతో ఆప్యాయంగా కాకపోయినా మామూలుగానైనా దగ్గర కూచుని మాట్లాడే దిక్కుండదు. ఇంట్లో ఏం జరుగుతుందో వాళ్లకు తెలియదు. ఎవరూ చెప్పరు. అడిగినా పట్టించుకోరు. 'మీకెందుకు' అంటారు. 'చెప్పినా వినిపించదు, అర్ధం కాదు' అంటారు. వూరికే పడుకోక ఆరాలెందుకని ఆగ్రహిస్తారు. మామూలుగా చూస్తే ఇదంతా హేతుబద్ధంగానే అనిపిస్తుంది. వాళ్లకు నిజంగానే వినిపించదు. నడవలేరు. చెప్పినా అర్థం కాదు. అలాంటప్పుడు అనవసరమైన ఆరాటం ఎందుకనే మాట చాలా సమర్ధనీయంగానే వుంటుంది. అనేక సందర్భాల్లో ఈ వృద్ధ మూర్తుల మాటలు, చేతలు చాలా విసుగు తెప్పించేవిగానూ విపరీతంగానూ కూడా వుంటాయి. వారు ఏదేదో మాట్లాడుతుంటారు. ఎవరున్నది లేనిది చూసుకోకుండా వ్యాఖ్యానిస్తుంటారు. అర్ధరహితంగా అడుగుతుంటారు. అయోమయంలో మునిగి తేలుతుంటారు. ఇలా చేస్తుంటారు గనక వారికి చెప్పడం, అడగడం ఎందుకు అనే అభిప్రాయం అసహనం కుటుంబ సభ్యులకు కలుగుతుంటాయి. కొంతమందికి సహజంగానే నిర్లక్ష్యం వుంటే కొంతమందికి చాలా ప్రేమాభిమానాలు వున్నా చెప్పడంలో వున్న చిక్కుల రీత్యా వెనకాడుతుంటారు. తిన్నావా తినలేదా, చలి పెడుతుంది స్వెట్టరు వేసుకో, కాళ్లకు చెప్పులు తొడుక్కో, టేబుల్ పైన స్వీట్లున్నాయి తిను... ఇలా ముసలివాళ్లు ప్రేమగా చెప్పే మాటలు కూడా చికాకు తెప్పిస్తున్నాయనుకుంటారు. ఉదాహరణకు ఎవరైనా వచ్చినపుడు ముసలివాళ్లు వుంటే కాఫీ తెచ్చివ్వు అని చెప్పారనుకోండి. 'ప్రతిదీ చెప్పాలా మాకు తెలియదా మేము చేయలేమా' అని కోపం పొడుచుకు వస్తుంది. ఇవన్నీ ప్రతి ఇంట్లో నిత్యానుభవమే. లేకపోతే ఏదైనా సమస్య ఎదురై తర్జనభర్జన పడుతుంటే ఆదుర్దా కొద్దీ చెప్పబోతారు. ఏమీ చేతగాని వాళ్లు వూరికే కూచోకుండా ప్రతి దాంట్లో తలదూర్చడమెందుకని కోపం నసాళానికంటుతుంది.

చిన్నవాళ్ల వైపు నుంచి చూస్తే నిజమే కదా అనిపించే ఈ అంశాలన్నిటిలోనూ వృద్ధుల వైపు నుంచి చూస్తే చాలా అమానవీయత దాగి వుంటుంది. ఎందుకంటే చేతనైనా కాకపోయినా వాళ్లు మనుషులు. నిన్నటి వరకూ మనకోసం పరితపించిన వాళ్లు. పరుగులు పెట్టిన వాళ్లు. ప్రతిదీ నిర్వహించిన వాళ్లు. నిన్నూ నన్నూ నిలబెట్టిన వాళ్లు. పిల్లాపాపా పెరగాలని రాణించాలని త్రికరణశుద్ధిగా కోరుకునే వాళ్లు. ఇంకా చెప్పాలంటే మన గురించిన ధ్యాస తప్ప మరేమీ లేని నిస్సహాయులు. ముసలివాళ్లనూ పసిపిల్లలనూ ఒకేవిధంగా చూడాలంటారు. ఒకరిది అపరిపక్వత అయితే మరొకరిది అసహాయత. ఒకరి ఆలోచలను అనుభవం చూడాల్సి వుంటే మరొకరి ఆలోచనలు అనుభవాలతో పండి పోయి శక్తి వుడిగిపోయి కొన్నిసార్లు సమతుల్యత కోల్పోతుంటాయి. వృద్ధులకు వూరికే భావోద్వేగాలు కలుగుతుంటాయి. వాళ్లు ఏడుస్తున్నారంటే మన మీద ఫిర్యాదు నిజమైపోదు. ఎప్పుడైనా కాస్త ప్రేమగా మాట్టాడితే మురిసిపోతారు కూడా. వాళ్లకు స్థిమితం లేదు గనక మనం రుసరుసలాడితే మనదే తప్పు తప్ప వాళ్లది కాదు.

ఇంతకూ ఇళ్లలోని వృద్ధుల పట్ల మన వైఖరి ఎలా వుండాలి? అన్నిటికన్నా ముఖ్యంగా పలకరింపే పరమానందం అన్నట్టుగా వుంటారు వాళ్లు. అందులోనూ పిల్లలు తమతో కాస్సేపు గడిపితే ప్రేమగా అదీ ఇదీ చెబితే అంతకంటే ఆనందం లేదనుకుంటారు. కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు, ఇరుగు పొరుగు, బంధు మిత్రులు తమకు సంబంధించిన కబుర్లు చెబితే సలహాలు అడిగితే ఇంక ఏనుగు ఎక్కినట్టే భావిస్తారు. ఇవన్నీ ఎందుకు కోరుకుంటారంటే తమ ఉనికికి ఒక గుర్తింపు, ఒక అర్ధం వుందన్న భావన కలుగుతుంది గనక. తాము వున్నా లేనట్టే భావించి ఎవరి మటుకు వారు బేఖాతరు చేస్తుంటే శారీరక రుగ్మతలకు మించిన మానసిక భారం వారిని కుదిపేస్తుంది. నిరర్ధకమైన భారంగా మారిపోయామన్న ఆలోచన నిరాశలో ముంచేస్తుంది. అప్పుడు అయోమయం ఇంకా పెరుగుతుంది. అది తిరిగి మరిన్ని సమస్యలకు దారి తీస్తుంది.

అలాగాకుండా వీలున్న మేరకు ఎవరో వొకరు వారితో మాటా మంతీ కలుపుతుంటే చిన్నవీ పెద్దవీ కబుర్లుచెబుతుంటే తమ మనుగడ సార్థకమైందనుకుంటారు. తాము చెప్పినవన్నీ పాటించి తీరాలని వృద్ధులేమీ అనుకోరు. తమ పరిమితులు వారికి బాగా తెలుసు. కనకనే తమను పట్టించుకోవాలని పలకరించాని మాత్రమే ఆశిస్తారు. ఆ కాస్త బాధ్యత నెరవేర్చడం కనీస ధర్మం. ఎందుకంటే పసిపిల్లలు పుడతారు గాని పెద్దవాళ్లు మళ్లీ పుట్టరు. ఉన్నప్పుడు ఎంతో విసుగనిపించే ఈ ముసలి వగ్గులు ఎల్లకాలం కాదు కదా ఎంతో కాలం వుండరు. వారిని సరిగ్గా ప్రేమగా చూసుకోగలిగామనే తృప్తి మాత్రం కలకాలం వుంటుంది. తర్వాత ఇతరులూ ముసలి వారవుతారు. అప్పుడు వారికీ ఇదే పరిస్థితి ఎదురవక తప్పదు. ఇప్పుడు పెద్దలు తమ కంటే ముసలి వారి పట్ల ఎలా ప్రవర్తిస్తున్నారో రేపటి తరం చూసి తామూ అదే విధంగా వ్యవహరిస్తారు. ఇదో పరిభ్రమణం. జీవన గమనం. అనుక్రమణం.

- భారతి



అదిరె అదిరె... గొర్రె రేటు అదిరె

'మరీ అంతొద్దు... మామూలుగా గొర్రె రేటు ఎంతుంటుంది? దానికే ఏకంగా పాట కట్టేయాలా!' అన్నట్టు చూస్తున్నారే. కానీ అసలు విషయం తెలిస్తే...మీరూ దంగైపోతారండీ. మోరిసన్ అనే రైతు దగ్గర ఓ గొర్రె వుంది. దాని వయసు 8 నెలలు. బాగా బలిష్టంగా వుంటుందిలెండి. ఫొటో చూస్తుంటేనే తెలుస్తుందిగా. దాన్ని ఇటీవల 231,000 పౌండ్లకు అమ్మేరు. 'అమ్మో అంత ధరా' అనుకుంటున్నారు కదూ. అందుకే కదా. ప్రపంచంలోకెల్లా అత్యంత ఖరీదైన గొర్రెగా పేరొచ్చేసింది దీనికి. మరో తమాషా ఏమంటే... ఆరేళ్ల కిందట ఒక గొర్రె 128,000 పౌండ్లకు అమ్ముడుపోయింది. ఇది కూడా బ్రిటన్‌లోనే జరిగింది. అది ఇటీవలే చనిపోయిందనుకోండి. అయితే తన జీవితకాలంలో అది ఒక మిలియన్‌కు పైగా ఖరీదుచేసే గొర్రెలకు తండ్రయింది. సర్సరి అసలు పాయింట్‌నుంచి పక్కకెళుతున్నాం కదూ. ఒక్క ముక్క చెప్పి ఈ గొర్రె పురాణం ముగించేస్తాం. కొత్త ఆసామి మాత్రం అంత డబ్బు పోసి ఆ గొర్రెను ఎందుకు కొంటే... దానికి పుట్టిన పిల్లలను భారీ మొత్తానికి అమ్మి సొమ్ము చేసుకోడాని...

పందిపిల్లే!

పుస్తకాన్ని దూరంగా పెట్టుకొని చూసి చెప్పండి. చూడ్డానికి గొర్రెలాగా వుందికదూ. మరి అంతంత ఊలు వంటినిండా వుంటే అలాకాక మరోలా ఎలా అనుకుంటాంలెండి. కానీ ఇది మేషం కాదు! వరాహం అంటే కూసింత నమ్మబుద్ధికాదు. కానీ... పుస్తకాన్ని దగ్గరగా పెట్టుకొని చూడండి. ముఖ్యంగా మొహం చూడండి. ముక్కు, చెవులు చూసి చెప్పండి. ఆ... ఇది వరాహమే. మరి ఊలు ఎలా వచ్చింది? అనుకొంటున్నారా! అదేనండీ సైన్స్ మహిమ. ఈ రెండు జంతువుల క్రాస్ బ్రీడ్ మన ఎదురుగా వున్న జంతువు. అందుకే పందికి ఊలు కోటు తొడిగినట్టున్న జంతువు పుట్టుకొచ్చింది. ఆస్ట్రియా, హంగరీలో ఈ బ్రీడ్‌ను రూపొందించారు. ఆ రెండు దేశాల్లో చలికాలం బాగా ఇబ్బందిగా వుంటుంది. అదే ఊలు వుంటే హాయిగా వుంటుంది కదా వాటికి. ఇప్పుడదే జరుగుతోంది. పైగా వేసవి కాలంలో భానుడి తీవ్రతకు చర్మం కమిలిపోకుండా కాపాడుతుంది. అలా రెండు రకాల ప్రయోజనాలున్నాయి. అసలు విషయం ఏమంటే... మామూలు పందికంటే ఈ ఊలు వరాహం ధర ఐదు రెట్లు ఎక్కువ. అదంతా ఎందుకు అసలు రేటు చెప్పండి అంటారా! ఆ... ఎంతా! సింపుల్‌గా 1, 000 పౌండ్లే. వీటిని ఈ మధ్యే బ్రిటన్‌లోని ఓ జ్యూకి తీసుకొచ్చారు. ఇంక చెప్పేదేముంది? ఎవరి నోట విన్నా ఊలు వరాహం గురించిన మాటలే వినిపిస్తున్నాయట.



తెలుసా!

పచ్చబొట్టు వేసేస్తా...

చిత్రంలో చూశారుగా. పసికూన. తిప్పి తిప్పి లెక్కబెడితే మూడున్నరేళ్లు వుంటాయేమో. పేరు రూబీ డికిన్సన్. పచ్చబొట్లు వేసేస్తోంది. మామూలుగా ఈ వయసు పిల్లలు పెన్ను పట్టుకోడానికే తిప్పలు పడుతుంటారు. అలాంటిది ఈ పిడుగు ఏకంగా పచ్చబొట్టే పొడుస్తోంది. దానికీ ఒక కారణం వుందిలెండి. పాప తండ్రి బ్లేన్ డికిన్సన్‌కు వేల్స్‌లో ఒక టాటూ పార్లర్ వుంది. నర్సరీ స్కూలు అయిపోగానే ఆ పాప షాపుకెళుతుంది. అక్కడ తండ్రి దగ్గర పచ్చబొట్టు ఎలా వేయాలో నేర్చుకుంటోంది. ఇప్పటికే తనకిష్టమైన సాలీడు బొమ్మను అందంగా వేసేస్తోంది. పాప ఆసక్తికి తగ్గట్టుగానే తండ్రి ప్రోత్సాహం, సహకారం వుంది. పాప చేతిలో చక్కగా ఇమిడిపోయే చిన్ని టాటూ మెషీన్‌ను అమెరికా నుండి తెప్పిస్తున్నాడు. పాపకు కూడా పెద్దయ్యాక టాటూ ఆర్టిస్టు కావాలన్న కోరిక వుంది. మరో ఆసక్తికరమైన అంశమేమంటే... ఎమిలీ అనే కెనడా పాప తనకు ఐదేళ్ల వయసులో సీతాకోకచిలుక పచ్చబొట్టు వేసి రికార్డు సృష్టించింది. ఇప్పుడు రూబీ ఆ రికార్డును బద్దలు కొట్టాలన్నది బ్లేన్ ఆశ. పైగా తన 40వ పుట్టినరోజునాటికి కాలిమీద పచ్చబొట్టు వేసేలా పాపను తీర్చిదిద్దాలని కోరుకుంటున్నాడు.



బన్నీ నీడ ఏది?

బన్నీ ఓసారి ఫొటో దిగాడు. అయితే ఫొటోగ్రాఫర్ బన్నీని ఆటపట్టించడానికి ఇదిగో ఇలా నాలుగు నెగటివ్‌లు ఇచ్చి పంపాడు. చూడ్డానికి నాలుగూ ఒకేలా వున్నా... అందులో ఒకటి మాత్రమే అచ్చం బన్నీలా వుంటుంది. మరి అది ఏది?

...మెళ్లో గంట కట్టేదెలా!

నేస్తాలూ... గంట ఎవరి మెడల్లో కడతాం! ఇంకా తెలీలేదా! అయితే చుక్క వున్న గడిలో నీలం రంగు అద్ది చూడండి. తెల్సిపోతుంది. ఒకేనా!



భానుడితో ఆడుకొంటోంది ఎవరు?

పిల్లలూ...ఈ బొమ్మలో ఎవరో వున్నారు. వారు సూర్యుడితో ఆడుకొంటున్నారు. ఇంతకీ వారెవరబ్బా... తెలియాలంటే 1 నుంచి 58 వరకు వరుసగా చుక్కలన్నీ కలిపేయండి.

ఒకేలా వున్న ముక్కలేవి?

బుజ్జాయిలూ... కింది బొమ్మను చింటూ అనే అల్లరి పిల్లవాడు చించేశాడు. అయితే తర్వాత వాడు ఒక తమాషా కనిపెట్టాడు. అదేంటంటే.. ఇందులో రెండు ముక్కలు అచ్చం ఒకేలా వున్నాయి. మరి ఆ రెండూ ఏవో చెప్పుకోండి.





పేరేంటి?

వీళ్లిద్దరూ గూఢచారులు. ఒకరి పేరు ఒకరికి తెలీదు. కాకపోతే అందరూ వారిని ఎక్స్ అనీ, వై అనీ పిలుస్తుంటారు. వైకు ఎక్స్ అసలు పేరు తెలుసుకోవాలనిపించింది. అడిగాడు. అప్పుడతను ఒక కోడ్ ఇచ్చాడు. మరి మీరు చెప్పండి అసలు ఎక్స్ పేరేంటి?

కుందేళ్లు ఎక్కడబ్బా...

ఫ్రెండ్స్! ఇక్కడ 4 కుందేళ్లున్నాయి. వాటి పేర్లేంటో తెల్సా! బన్నీ, ఫన్నీ, విన్నీ, మున్నీ. అన్నీ కలిసి దాగుడు మూతలు ఆట ఆడుకుంటున్నాయి. అదీ క్యాబేజీ మొక్కల వెనక. మరి 4 కుందేళ్లు ఎక్కడున్నాయో చూసి గుర్తు పట్టండి.







గళ్లు నింపండి

బుజ్జాయిలూ...మీకు ఆంగ్లభాషా పరిజ్ఞానం చాలా ఎక్కువకదా. మరైతే కింద ఇచ్చిన ఆధారాల సాయంతో పై బాక్సు నింపేయండి. చివరికి సమాధానం చూడండే.

నేస్తాన్ని చేరేదెలా!

హాయ్...చూశారుగా. ఈ సాలీడుకు, బుజ్జికి మంచి స్నేహం వుంది. రోజూ కలిసి ఆడుకొంటాయి. పాడుకొంటాయి. కబుర్లు చెప్పుకొంటాయి. కానీ సాలీడు బుజ్జిని చేరేదెలా?



మాటల కోట - 34

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1			2		3		4	5
		6			7	8		
	9			10		11		
12		13	14		15			16
17			18				19	
		20			21	22		
	23			24		25		
26		27	28		29			30
31			32				33	

అడ్డం :

1. మేలైన, గొప్పదైన(2)
2. ఇంట్లో ఏదున్నా లేకున్నా రక్షణకు మాత్రం ఇది తప్పని సరి (3)
4. సాధుత్వం, ఇలాంటి గోవు పాలు గరిటడైన చాలంటాడు వేమన (2)
6. తడి, నీటి చెమ్మ (2)
7. దారి తప్పిన తర్వాత, మురికి. అటునుండి (2)
9. ఇంగ్లీషోడి డబ్బు (2)
10. అడ్డం నాలుగు తోడు పదానికి వ్యవహారికంలో తొలి అక్షరం (1)
11. దించటం (2)
13. నాలుక పని (2)
15. చెడు వాసన, గబ్బు (2)
17. అటు నుంచి ఇటు కూసిన కొక్కరొకో (2)
18. పండగలకీ, పబ్బాలకీ వినిమయ వస్తువులపై దుకాణదారులు ప్రకటించే రాయితీ. ప్రకటనలో ఓ పదం తిరగబడింది. మా మధ్యమం (3)
19. లక్ష నూర్లు ఒక్కటయితే (2)
20. మొక్కల్లో సూర్యరశ్మిని తీసుకుని ఆహారం తయారు చేసేవి ఇవే. ఏకవచనం (2)
21. తట్ట, బుట్ట (2)
23. కాకినాడ పేరింటేనే నోరూరించే తినుబండారం తిరగబడింది (2)
24. అచ్చు ఉ మాదిరిగానే పలికే హల్లు, 10 అడ్డంలో రెండో పదం (1)
25. లెక్కల రూపం భిన్నంలో పైభాగం (2)
27. భారతం బొంకు అనీ, రామాయణం ఇది అనీ కొందరంటారు (2)
29. భారతీయ స్త్రీల వస్త్రం (2)
31. ఒప్పు కాదు (2)
32. పోయిన సంవత్సరం (3)
33. అన్నానికి ఇది తోడు లేనిదే తినటం కుదరదు (2)

నిలువు

1. శీతాకాలంలో నీటి వాయు రూపం, చల్లటి వాతావరణంలో ఘన రూపం (2)
2. వారి యొక్క (2)
3. పిల్లి కాదు ఆ జాతి క్రూర జంతువు (2)
5 ప్రస్తుత లీటర్ల కొలత రాక మునుపు సంప్రదాయ కొలతలో చివరిది ఇదే (2)
6. తెలుగు టీ (3)
8. విలువ కట్టటం (3)
12. ఈ జంతువు పాలు కుండెడు ఉన్నా ఉపయోగం లేనివని అంటాడు వేమన (3)
14. విసుగు (3)
15. కింద నుంచి ఇదో పేలుడు స్వభావమున్న ఖనిజం (3)
16. గాలి, వెలుతురు కోసం ప్రతి ఇంటికీ ఇది అవసరం (3)
20. రూపం (3)
22. అక్షరాలు దిద్దేనాడు ఇది ఉండాల్సిందే (3)
26. ముదురు కాదు (2)
28. మూల మలుపు, వీధి మలుపు (2)
29 మంచం కాలు (2)
30. నక్షత్రం, నటుడు (2)

మాటలకోట - 33జవాబు

1 దూ	2 ది		3 ము	4 ను	పు		5 తూ	6 ము
7 కు	డు	ము		దు		8 డు	రు	ని
	గు		9 బ	రు	10 కు		పు	
11 ఆ		12 క	రి		13 ప్ప	14 అ		15 పా
16 వ	సు	ధ		17 జాం		18 రు	జు	వు
డ		19 నం	20 ది		21 పా	దు		లు
	22 ప		23 ఆ	24 కా	శం		25 ట	
26 ఆ	సి	యా		ప		27 జ	ము	28 న
29 గం	డి		30 వి	రి	వి		31 కు	క్క

ఆకాశం విరిగి పడింది



ఒక ఊర్లో పూరి గుడిసె వుంది. అది చాలా పాతది. దాని మీద కట్టెల మోపు వుంది. ఓ కోడిపెట్ట ఎగురుతూ వచ్చి ఆ కట్టెల మోపు మీద పడింది. దాంతో కట్టెలన్నీ చెల్లాచెదరుగా కిందపడిపోయాయి. ఆ శబ్దానికి కోడిపెట్టకి భయం వేసింది. ఆకాశం విరిగి తన మీద పడుతుందేమో అనుకుంది. ఇక అంతే... "ఆకాశం విరిగి పడింది... ఆకాశం విరిగి పడింది..." అంటూ పరుగెత్తసాగింది.

ఇది విన్న కోడిపుంజు "ఎవరు చెప్పారు నీకు, ఆకాశం విరిగిపడిందని?" అని అడిగింది.

"ఎవరో చెప్పడమేంటి? నా కళ్లతో నేను చూశాను. ఎంత పెద్ద శబ్దం వచ్చిందో తెలుసా! నేనైతే చాలా భయపడిపోయాను. అందుకే అక్కడి నుండి పరుగెత్తుకుంటూ వస్తున్నాను" అంది కోడిపెట్ట. పుంజు దాని మాట నమ్మింది. ఇవి రెండూ కలిసి అడవిలోకి పరుగెత్తాయి.

అక్కడ వాటికి ఓ కుందేలు కనిపించింది. దానితో కూడా పెట్ట "ఆకాశం విరిగిపడింది" అని చెప్పింది.

"ఎవరు చెప్పారు?" అని కుందేలు అడిగింది.

"ఎవరో చెప్పడమేంటి? నా కళ్లారా చూశాను" అంది పెట్ట. ఈ మాటలను కుందేలు కూడా నమ్మింది. మళ్లీ ఈ మూడు కలిసి పరుగెత్తసాగాయి.

ఒక నక్క వాటిని చూసి "ఎందుకు పరుగెత్తుతున్నారు?" అనడిగింది.

దానికి పెట్ట "అక్కడ ఆకాశం విరిగి పడింది. నేను నా కళ్లారా చూశాను. నా కాలు కూడా విరిగింది. అందుకే భయపడి మేమంతా పరుగెత్తుతున్నాం" అంది. ఇదంతా నిజమేనని నమ్మిన నక్క కూడా వీటితోపాటు పరుగెత్తడం ప్రారంభించింది.

వీటికి దారిలో తోడేలు కనిపించింది. దానితో కూడా కోడిపెట్ట "ఆకాశం విరిగిపడింది. పరుగెత్తు..." అని చెప్పి తమ వెంట తోడేలును కూడా తీసుకెళ్లింది.

అన్నీ కలిసి పరుగెత్తుకుంటూ చాలా దూరం వెళ్లాయి. అలా పరుగెత్తీ పరుగెత్తీ ఒక పెద్ద గుంతలో పడ్డాయి. బయటికి రావడానికి దారిలేక ఆ గుంతలోనే మూడు రోజులున్నాయి. ఆ గుంతలో కొన్ని దుంపలు ఉన్నాయి. శీతాకాల అవసరాల కోసమని కోయజాతివాళ్లు వాటినక్కడ దాచిపెట్టుకున్నారన్నమాట.

కుందేలు, పెట్ట, పుంజు ఆ దుంపలనే తినసాగాయి. కానీ నక్క, తోడేలుకు తినడానికి ఏమీ లేవు. ఆకలితో అలమటించి పోతున్నాయి. ఇక తోడేలు ఆకలికి ఆగలేక ఒక ఉపాయం ఆలోచించింది.

నక్కతో "చూడు చెల్లీ! మనందరి పేర్లేంటో చెప్పు. ఎవరి పేరు బాలేకపోతే వారిని తినేద్దాం" అంది.

దానికి నక్క "నాపేరు నక్క. అద్భుతమైన పేరు. ఇంక తోడేలు పేరుకు వంక పెట్టడానికి లేదు. కుందేలు పేరూ బావుంది. కోడి పుంజు.. ఈ పేరూ బానే ఉంది. ఇక పెట్ట. అబ్బే ఈ పేరు ఏం బాలేదు" అంది.

దాంతో నక్క, తోడేలు కోడిపెట్టని తినేశాయి. నక్క ఎక్కువగా తినలేదు. కానీ తిన్నదానికంటే ఎక్కువగా ఎముకల్ని, చిన్న చిన్న మాంసపు తునకల్ని తన కడుపులో దాచుకుంది.

మరుసటి రోజు మళ్లీ తోడేలుకు ఆకలి మొదలైంది. "మన పేర్లేంటో మరోకసారి చెప్పు చెల్లీ. ఎవరి పేరు బాగోకపోతే వాళ్లని లాగించేద్దాం" అని నక్కని అడిగింది తోడేలు.

"నక్కపేరు బావుంది. తోడేలు పేరూ బావుంది. కుందేలు పేరూ బావుంది. అబ్బ... కోడిపుంజు పేరే రోతగా వుంది" అంది నక్క. దాంతో ఆ పూటకి కోడిపుంజును గుటకాయస్వాహా చేశాయి. ఆ తర్వాతి రోజు తోడేలు మళ్లీ ఆకలి కేకలు మొదలు పెట్టింది. ఈసారి కుందేలు పేరు బాలేదంది నక్క. ఆ పూటతో కుందేలు పని అయిపోయింది. నక్క ఎప్పటిలాగే కొంచెం మాత్రమే తిని మిగతాది తన కడుపు కింద దాచిపెట్టుకుంది. ఇక గోతిలో తోడేలు, నక్క మాత్రమే మిగిలాయి. తర్వాతి రోజు మళ్లీ తోడేలుకు ఆకలి మొదలయింది. ఏం చేయాలో తెలియడం లేదు. నక్క మాత్రం తన పొట్టకింద దాచుకున్న ఎముకల్ని, మాంసపు ముక్కల్ని బయటికి తీసి తీరిగ్గా తింటూ కూర్చుంది. ఏదో కొరికిన చప్పుడు తోడేలుకు వినిపించింది.

"ఏం కొరుకుతున్నావు?" అని నక్కని అడిగింది.

"ఏం లేదు. ఆకలవుతుంటే నా తోకని కొరుకుతున్నా. తర్వాత నమిలి మింగేస్తా" అంది నక్క

"భలే! భలే! నేనూ నీలాగే చేస్తా" అని ఆకలితో వున్న తోడేలు తన తోకని నమలడం మొదలుపెట్టింది.

ఇదే అదనుగా భావించిన నక్క గోడను తొలిచి, మెల్లగా గోతిలోనుండి బయటపడింది.

తన కంటే ఎంతో బలంగా వుండే తోడేలును తన తెలివితేటలతో బోల్తా కొట్టించింది జిత్తులమారి నక్క. అంతేకాదు! ప్రాణాపాయం నుండి బయటపడింది.

నోరూరించే చిత్రాలు



రకరకాల ఇంకులతో కాగితం మీద బొమ్మలు అందరూ వేస్తారు. అదే ఆహార పదార్థాలను ఉపయోగించి చిత్రాలు వేయగలరా! కూసింత కాదు... చాలా కష్టం. ఆ పని చేయడం లండన్‌వాలా కార్ల్ వార్నర్‌కు వెన్నతో పెట్టిన విద్య. అందుకు నిదర్శనాలే మన ముందున్న చిత్రాలు. పరిశీలనగా చూడండి. అన్నీ తిండిపదార్థాలతో చేసినవే. కూరగాయలు, మాంసం, బిస్కెట్లు, చాక్లెట్లు... ఏది ఉపయోగపడుతుందని భావిస్తే...దాన్ని వాడుకొని చక్కటి కళాఖండాలు సృష్టించేశాడు. వీటిలో కనిపించే ఆహార పదార్థాలలో అధికశాతం మనకు బాగా తెల్సినవే. ఏంటీ...వాటిని చూస్తుంటే లాలాజలాన్ని అదుపు చేయడం కష్టంగా వుందా! అందుకు కార్ల్ చేసిన కృషి అంతా ఇంతా కాదు. ముందు తను చేయదలచుకొన్న చిత్రం నకలును పేపర్‌మీద వేసుకొంటాడు. తర్వాత దానికి సరంజామా సమకూర్చుకుంటాడు. అది చిన్న విషయం కాదు. ఏ కూరగాయ ఏ ఆకారంలో వుంటే ఉపయోగపడుతుంది? ఏ రంగులో వుంటే సరిగ్గా నప్పుతుంది? మాంసాన్ని ఏ ఆకారంలో కత్తిరిస్తే తను ఊహించిన దానికి సరిగ్గా సరిపోతుంది? వంటివన్నీ బేరీజు వేసుకొని సేకరిస్తాడు. తర్వాత సెట్ చేస్తాడు. చివరిగా ఫొటోలు తీస్తాడు. అవే ఇప్పుడు మీ ముందున్నది. సూపర్‌గున్నాయి కదూ.